11th వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 36 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం గురువారం 18 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 36 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM THU 18 DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## వచ్చే జనవరి నుంచి జిల్లాల్లో సీఎం చంద్రబాబు ఆకస్మిక తనిఖీలు

- ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- ఇకపై జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడతానని వెల్లడి
- మూడు నెలల్లో పట్టణాల్లో మురుగు కాలువలు శుభ్రం చేయాలని ఆదేశం
- తాగునీటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం
- వచ్చే త్రైమాసికానికి జీరో గ్రీవెన్సులు లక్ష్యంగా పనిచేయాలని సూచన

పెన్ పవర్ డెస్క్:ప్రజా సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఏమాత్రం జాప్యం సహించేది లేదని, 'జీరో టాలరెన్స్' విధానంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో అధికారుల పనితీరును పరిశీలించేందుకు జనవరి నుంచి జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడతానని ఆయన హెచ్చరించారు.కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ... ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ శాఖలో ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయో విశ్లేషణ చేసి, పాలనను మెరుగుపరచాలన్నారు. గ్రీవెన్సులు తక్కువగా వస్తేనే పాలన బాగున్నట్లు లెక్క అని ఆయన అభిప్రాయపడ్డారు. వచ్చే త్రైమాసికానికి 'జీరో గ్రీవెన్సుల'ను లక్ష్యంగా నిర్దేశించారు.రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో మురుగు కాలువలను రాబోయే మూడు నెలల్లోగా పూర్తిగా శుభ్రపరిచేందుకు కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే జలవనరుల శాఖ వెంటనే స్పందించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. నీటి భద్రత గురించి మాట్లాడుతున్న తరుణంలో ప్రజలకు తాగునీటి కష్టాలు ఉండకూడదని చంద్రబాబు తేల్చిచెప్పారు.



## పీపీపీ అంటే ప్రైవేట్ పరం కాదు...

### మెడికల్ కాలేజీలపై క్లారిటీ ఇచ్చిన సీఎం చంద్రబాబు

- పీపీపీ విధానంలో నిర్మించినా మెడికల్ కాలేజీలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయని వెల్లడి
- విమర్శలకు భయపడబోమని సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- రుషికొండ ప్యాలెస్‌పై రూ.500 కోట్లు వృధా చేశారని ఆరోపణ
- గత ప్రభుత్వ అనాలోచిత విధానాలతో రాష్ట్రం అప్పులపాలైందని వెల్లడి
- సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్న చంద్రబాబు

వివరాలు 2లో..





## పులివెందులలో జగన్‌కు ఎదురుదెబ్బ.. టీడీపీలో చేరిన అనుచరుడు

- వందలాది కార్యకర్తలతో టీడీపీలో చేరిన చంద్రశేఖర్ రెడ్డి
- బీటెక్ రవి సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ శ్రేణులు
- ఆందోళనలో వైసీపీ నేతలు, కార్యకర్తలు

పెన్ పవర్ డెస్క్:సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీకి వలసల బెడద కొనసాగుతోంది. తాజాగా ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జగన్ అనుచరుడు, వైసీపీ నేత చంద్రశేఖర్ రెడ్డి (దిల్ మాంగే) తన అనుచరులతో కలిసి తెలుగు దేశం పార్టీలో చేరారు.పులివెందుల నియోజక వర్గంలోని వేంపల్లిలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. వందలాది మంది వైసీపీ కార్యకర్తలతో కలిసి చంద్రశేఖర్ రెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

వివరాలు 2లో..

## స్వచ్ఛ రథం సత్ఫలితాలనిస్తోంది

- కూటమి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కలెక్టర్లు నిబద్ధతతో పనిచేయాలన్న పవన్
- గిరిజన గ్రామాలకు రహదారి కల్పించే 'అడవి తల్లి బాట'కు అధిక ప్రాధాన్యం
- 'పల్లె పండుగ 1.0' ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం
- పంచాయతీరాజ్ సిబ్బంది శిక్షణలో దేశంలోనే ఏపీకి ప్రథమ స్థానం
- ఉపాధి హామీ పథకం ద్వారా లక్షలాది కుటుంబాలకు ఆర్థిక చేయూత




పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయి లో ప్రజలకు చేరవేసేందుకు జిల్లా కలెక్టర్లు నిబద్ధతతో పనిచేయా లని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చా రు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ దిశగా అధికారులు మరింత ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 5వ కలెక్టర్ల సదస్సులో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖల మంత్రిగా ఆయన పలు కీలక అంశాలపై అధికారు లకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా చేపట్టిన 'పల్లె పండుగ 1.0' పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంపై కలెక్టర్లకు అభినందన లు. ఈ కార్యక్రమం కింద గ్రామాల్లో 4,000 కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, రైతులకు అండగా 22,500 మినీ గోకులాలు, 15,000 నీటి తొట్టెలు, 1.2 లక్షల ఫామ్ పాండ్స్‌ను విజయవంతంగా నిర్మించాం" అని తెలిపారు.ఉపాధి హామీ పథకం (నరేగా) ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో 41.12 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించి, రూ.4,330 కోట్ల వేతనాలు చెల్లించామని, ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎంతో చేయూతనిచ్చిందని వివరించారు.మారుమూల గిరిజన గ్రామాలకు

వివరాలు 2లో..

## క్రీడా ఆణిముత్యాలను గౌరవించడంలో ఏపీ ఎప్పుడూ ముందుంటుంది




- మహిళా క్రికెటర్ శ్రీచరణికి ఏపీ ప్రభుత్వం అండ
- శ్రీచరణికి రూ.2.5 కోట్ల చెక్ అందించిన మంత్రి నారా లోకేశ్
- ప్రభుత్వ నిర్ణయంపై నారా భువనేశ్వరి హర్షం
- మహిళల వన్డే ప్రపంచకప్‌లో శ్రీచరణి అద్భుత ప్రదర్శన
- ప్రతిభావంతులను గౌరవించడంలో ఏపీ ముందుంటుందని వ్యాఖ్య
- శ్రీచరణి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

వివరాలు 2లో..

## 16 మంది మావోల అరెస్ట్... మావోయిస్టు పార్టీ కీలక లేఖ

- ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్‌లో 16 మంది అరెస్ట్
- అరెస్టులకు ఖండించిన మావోయిస్టు పార్టీ
- అధికార ప్రతినిధి జగన్ పేరుతో మావోయిస్టుల లేఖ



పెన్ పవర్ డెస్క్:ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్‌లో 16 మంది మావోయిస్టులను అరెస్ట్ చేయడంపై మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా స్పందించింది. ఈ అరెస్టులను ఖండిస్తూ కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో ఓ లేఖను విడుదల చేసింది. కకర్ బుడ్డి, బాబ్జీ పేట్ గ్రామాల సమీపంలో

వివరాలు 2లో..

## ఒబెరాయ్ హోటల్‌కు రూ.3 వేల కోట్ల టీటీడీ భూమి..

### భూమన సంచలన ఆరోపణలు

- చంద్రబాబు ప్రభుత్వం స్వామివారికి తీరని ద్రోహం చేసిందన్న భూమన
- లీజు మాఫీ చేసి ప్రైవేటు సంస్థకు దోచిపెట్టారని ఆరోపణ
- ఎర్రచందనం చెట్లను మాయం చేశారని విమర్శ



పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వంపైనా, టీటీడీ ఛైర్మన్ పైనా వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. తిరుపతిలో అత్యంత విలువైన రూ.3 వేల కోట్ల టీటీడీ భూమిని ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి కట్టబెట్టి, శ్రీ వేంకటేశ్వర స్వామికి తీరని ద్రోహం చేశారని ఆయన విమర్శించారు. ఇది పరకామణి

వివరాలు 2లో..

## ఆ పథకానికి పేరు మార్చడం అంటే గాంధీని రెండోసారి చంపడమే



పెన్ పవర్ డెస్క్: పేరు మార్పుపై కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్షాల నిరసన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్చాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది జాతిపితను రెండోసారి హత్య చేయడమేనని ఆయన అభివర్ణించారు. యూపీఏ హయాంలో ప్రవేశపెట్టిన

వివరాలు 2లో..

- ఉపాధి హామీ చట్టం పేరు మార్పుపై చిదంబరం తీవ్ర వ్యాఖ్యలు
- ఇది గాంధీని మళ్లీ హత్య చేయడమేనని విమర్శ
- గాంధీ పేరును ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేసే కుట్ర అంటూ ఫైర్
- లోక్‌సభలో కొత్త బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం

## ఇథియోపియాలో 'వందేమాతరం'..

### పులకించిపోయిన ప్రధాని మోదీ..



వివరాలు 2లో..

- ఇథియోపియా పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ
- మోదీ గౌరవార్థం విందు ఏర్పాటు చేసిన ఇథియోపియా ప్రధాని
- విందులో 'వందేమాతరం' ఆలపించిన స్థానిక గాయకులు
- సంతోషం వ్యక్తం చేస్తూ చప్పట్లతో అభినందించిన ప్రధాని
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో

## ఎడిటర్ వ్యూ

### వల్లభనేని వంశీ రూపు రేఖలు మారకపోవడానికి అదే కారణమా?

గన్నవరం రాజకీయాలు మళ్లీ గరం గరంగా మారనున్నాయి. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తిరిగి గన్నవరం పాలిటిక్స్ లో యాక్టివ్ అయ్యారు. దాదాపు రెండేళ్ల పాటు గన్నవరం రాజకీయాలకు దూరంగా ఉన్న వల్లభనేని వంశీ తాజాగా ఇప్పుడు తిరిగి తన పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వల్లభనేని వంశీ తిరిగి యాక్టివ్ కావడంతో అక్కడ వైసీపీ కార్యక్రమాలు కూడా ఊపందుకున్నాయి. గన్నవరం నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వల్లభనేని వంశీ గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తర్వాత కొన్ని నెలల పాటు జైల్లో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వల్లభనేని వంశీ రూపు రేఖలు కూడా జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత మారిపోయాయి.

**అదే రకంగా...**

ఇప్పటికీ అదే రకంగా వల్లభనేని వంశీ మెయిన్ టెయిన్ చేస్తున్నారు. గతంలో యువకుడిగా కనిపిస్తూ, జట్టుకు రంగు వేసుకుని కనిపించే వల్లభనేని వంశీ గత కొద్ది రోజుల నుంచి మాత్రం తెల్లజుట్టు, బక్కపలచగానే ఉన్నారు. అది కేవలం సెంటిమెంట్ తోనే వంశీ జనంలోకి వెళ్లి సింపతీని పొందాలనుకుంటున్నట్లుంది. అందుకే ఆయన తన రూపు రేఖలను మార్చుకునే ప్రయత్నం చేయడం లేదు. వల్లభనేని వంశీని గతంలో , ఇప్పుడు చూసిన వారికి పాపం.. అనిపించేలా వంశీ ఉండటం ఆయనకు కలసి వచ్చే అంశమని చెబుతున్నారు. జైల్లో 140 రోజుల పాటు ఉన్న వల్లభనేని వంశీ తెల్ల జుట్టుతో పాటు అనేక ఆరోగ్య పరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వచ్చే ఎన్నికల వరకూ ఇదే రకంగా మెయిన్ టెయిన్ చేసి తిరిగి గెలుపొందేలా ప్లాన్ చేసుకున్నారని తెలిసింది.

**గన్నవరంలో వరస పర్యటనలతో...**

వల్లభనేని వంశీ ఇటీవల వరసగా అనేక వివాహ వేడుకలకు హాజరయ్యారు. అక్కడ టీడీపీ నేతలను కూడా పలుకరించడం, ఆత్మీయంగా దగ్గరకు తీసుకోవడం చర్చనీయాంశమైంది. వివాహ వేడుకలలో మాత్రమే కాకుండా అనేక కార్యక్రమాలకు కూడా ఆయన హాజరవుతున్నారు. గన్నవరం నియోజకవర్గంలో వల్లభనేని వంశీ విస్తృతంగా పర్యటిస్తున్నారు. వైసీపీ కార్యకర్తలకు ధైర్యం చెబుతున్నారు. తాను ఎక్కడకూ వెళ్లనని, ఇక్కడే ఉండి రాజకీయాలను కొనసాగిస్తానని చెబుతున్నారు. తనపై పదకొండు కేసులు నమోదయ్యాయని, ఇంతకు మించి ఏం చేస్తారన్న ధీమా వల్లభనేని వంశీలో స్పష్టంగా కనిపిస్తుంది. గన్నవరం టీడీపీలో నెలకొన్న అసంత ృప్తులను సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# పీపీపీ అంటే ప్రైవేట్ పరం కాదు...

రాష్ట్రంలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో నిర్మించే వైద్య కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయని, వాటిని ప్రైవేట్ పరం చేస్తున్నారంటూ వస్తున్న విమర్శలలో ఎలాంటి వాస్తవం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో ప్రారంభమైన ఐదవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పీపీపీ విధానంపై పూర్తి స్థాయి స్పష్టత ఇచ్చారు. పీపీపీ ద్వారా వైద్య సేవలను మరింత మెరుగుపరిచి, ప్రజలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.“పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నా, అవి ప్రభుత్వ కళాశాలల పేరుతోనే కొనసాగుతాయి. వాటి నిర్వహణ, నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్దేశిస్తుంది. ఈ కళాశాలల్లో 70 శాతం మందికి ఎన్టీఆర్ వైద్య సేవల కింద చికిత్స అందుతుంది. సీట్లు కూడా పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం సైతం అనేక ప్రాజెక్టులను పీపీపీ పద్ధతిలోనే చేపడుతోంది. రోడ్లను పీపీపీ ద్వారా నిర్మిస్తే అవి ప్రైవేటు వ్యక్తులవి అయిపోతాయా? కేవలం విమర్శల కోసం మాట్లాడితే భయపడేది లేదు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉంది“ అని ముఖ్యమంత్రి అన్నారు.గత ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలుగత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని చంద్రబాబు విమర్శించారు. “రూ.500 కోట్లతో రుషికొండలో ప్యాలెస్ నిర్మించి ప్రజాధనాన్ని వృథా చేశారు. ఆ డబ్బుతో రెండు అత్యాధునిక మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తయ్యేది. ఇప్పుడు ఆ ప్యాలెస్ నిర్వహణ ప్రభుత్వానికి పెను భారంగా మారింది. గత ప్రభుత్వంలో జీతాలు కూడా ఇవ్వలేని దయనీయ పరిస్థితులు ఉండేవి. 13 నుంచి 14 శాతం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు. అనవసరపు ఖర్చులతో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు“ అని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలతో ఆ అప్పులను రీ-షెడ్యూల్ చేస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన 70 శాతం ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేసి, కొత్త రోడ్లు నిర్మిస్తున్నామని వివరించారు.'సూపర్ సిక్స్' సూపర్ సక్సెస్ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన 'సూపర్ సిక్స్' పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. “పేదలకు ఆర్థికంగా అండగా నిలవాలనే లక్ష్యంతోనే సూపర్ సిక్స్ పథకాలను తీసుకొచ్చాం. సామాజిక భద్రత పెన్షన్లను ప్రతినెలా ఒకటో తేదీనే అందిస్తున్నాం. 'తల్లికి వందనం' ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతున్నా

అందరికీ లబ్ధి చేకూరుస్తున్నాం. 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు రెండు విడతల్లో రూ.14 వేలు అందించాం. దీపం-2.0, స్త్రీశక్తి పథకాలతో పాటు మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేశాం.

డ్వాక్రా, మెప్మా సంఘాలను అనుసంధానం చేసి మహిళలను బలోపేతం చేస్తున్నాం. పెద్దఎత్తున గృహ నిర్మాణాలు చేపట్టి అందరికీ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నాం“ అని ఆయన వివరించారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా (P4 - Public, Private, People Partnership for Poverty Eradication) పనిచేయాలని, ప్రజలకు ప్రివెంటివ్, క్యురేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్ విధానంలో వైద్యారోగ్యం అందించాలని కలెక్టర్లకు సూచించారు.

# క్రీడా ఆణిముత్యాలను గౌరవించడంలో ఏపీ ఎప్పుడూ ముందుంటుంది

మహిళల వన్డే ప్రపంచకప్‌లో అద్భుతమైన ప్రదర్శనతో రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చిన క్రికెటర్ శ్రీచరణికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా నిలవడంపై సీఎం చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. ఇవాళ మంత్రి నారా లోకేశ్ తెలుగు క్రికెటర్ శ్రీచరణికి రూ.2.5 కోట్ల చెక్ అందించారు. దీనిపై నారా భువనేశ్వరి స్పందించారు. క్రీడల్లో రాణిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి, వారికి సరైన ప్రోత్సాహం అందించాలన్న ప్రభుత్వ నిబద్ధతను ఆమె ప్రశంసించారు.ఈ సందర్భంగా ఆమె, “రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచే క్రీడాకారులను గౌరవించడంలో ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ ముందుంటుంది. శ్రీచరణికి ప్రభుత్వం అందిస్తున్న ఈ గుర్తింపు, మద్దతు హర్షణీయం. ఇలాంటి ప్రోత్సాహకాలు భవిష్యత్ తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయి“ అని పేర్కొన్నారు.కష్టపడి రాణించే క్రీడాకారులకు ప్రభుత్వం అండగా నిలవడం వారిలో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుందని అభిప్రాయపడ్డారు. శ్రీచరణి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, గొప్ప విజయాలు సాధించాలని నారా భువనేశ్వరి ఆకాంక్షించారు.

# పులివెందులలో జగన్‌కు ఎదురుదెబ్బ..

## టీడీపీలో చేరిన అనుచరుడు

- మొదటి పేజి తరువాయి

ఈ కార్యక్రమానికి ముందు వేంపల్లి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డితో పాటు పలువురు స్థానిక టీడీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జరుగుతున్నప్పటికీ, జగన్ రాజకీయ కంచుకోట అయిన పులివెందులలోనే కీలక నేతలు పార్టీ వీడటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పరిణామం స్థానికంగా వైసీపీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తోంది.

# ఇథియోపియాలో 'వందేమాతరం'..

ప్రధాని నరేంద్ర మోదీ తన విదేశీ పర్యటనలో భాగంగా ఇథియోపియాలో పర్యటిస్తున్నారు. జోర్డాన్ పర్యటన ముగించుకుని ఇథియోపియా చేరుకున్న ఆయనకు అక్కడ అరుదైన, మర్చిపోలేని స్వాగతం లభించింది. 15 ఏళ్ల తర్వాత ఆ దేశంలో పర్యటిస్తున్న భారత ప్రధానికి గౌరవ సూచకంగా ఇథియోపియా గాయకులు భారత జాతీయ గీతం 'వందేమాతరం' ఆలపించారు. ఈ అద్భుత ప్రదర్శనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఇథియోపియా ప్రధాని అబీ అహ్మద్.. ప్రధాని మోదీ గౌరవార్థం ప్రత్యేక విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా స్థానిక గాయకులు 'వందేమాతరం' గీతాన్ని ఎంతో శ్రావ్యంగా ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు.

తమ దేశానికి వచ్చిన భారత ప్రధానికి ఈ విధంగా స్వాగతం పలికారు. ఈ పరిణామంతో పులకించిపోయిన ప్రధాని మోదీ.. గాయకుల ప్రదర్శనను చప్పట్లతో అభినందించారు.భారతదేశానికి స్ఫూర్తినిచ్చిన వందేమాతరం గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో విదేశీ గడ్డపై ఈ గీతాన్ని ఆలపించడం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ అరుదైన ఘట్టం ఇరు దేశాల మధ్య సాంస్కృతిక బంధానికి నిదర్శనంగా నిలిచింది.

# ఒబెరాయ్ హోటల్‌కు రూ.3 వేల కోట్ల టీటీడీ భూమి..

## భూమన సంచలన ఆరోపణలు

- మొదటి పేజి తరువాయి

దొంగతనం కన్నా వంద రెట్లు పెద్దదని ఆరోపించారు. ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.వంద గదుల హోటల్ కోసం అలిపిరి రోడ్డులోని అత్యంత విలువైన భూమిని ఎలా ఇస్తారని ప్రశ్నించారు. పర్యాటక శాఖ భూమికి బదులుగా టీటీడీ భూమిని బదిలీ చేయడమే కాకుండా, లీజును కూడా మాఫీ చేసి చంద్రబాబు ప్రైవేటు సంస్థకు దోచిపెట్టారని ఆరోపించారు. ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ, అది ఈసీ (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్)లో కనిపించకుండా ఎందుకు దాస్తున్నారని భూమన నిలదీశారు. దీని వెనుక వేల కోట్ల అవినీతి దాగి ఉందని, చంద్రబాబు, పవన్ కలిసి ఈ భూమిని ప్రైవేటు సంస్థకు అప్పగించారని విమర్శించారు.టీటీడీ భూములను ప్రైవేటుపరం చేయడాన్ని స్వాములు, పీఠాధిపతులు, మఠాధిపతులు తీవ్రంగా వ్యతిరేకించాలని ఆయన కోరారు. తిరుమల భక్తులను చంద్రబాబు ప్రభుత్వం నిలువునా మోసం చేస్తోందని భూమన కరుణాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లను నరికి మాయం చేశారని ఆరోపించారు. ఈ అక్రమంపై అటవీశాఖ మంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని భూమన ప్రశ్నించారు.

# ఆ పథకానికి పేరు మార్చడం అంటే గాంధీని రెండోసారి చంపడమే

- మొదటి పేజి తరువాయి

ఈ పథకం పేరును మార్చేందుకు ఉద్దేశించిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ లైవ్లీహుడ్ మిషన్ (రూరల్)' బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది.ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన చిదంబరం... “ఇన్నాళ్లూ జవహర్‌లాల్ నెహ్రూను అప్రతిష్ఠపాలు చేసిన బీజేపీ ప్రభుత్వం, ఇప్పుడు మహాత్మా గాంధీని లక్ష్యంగా చేసుకుంది“ అని ఆరోపించారు. 2004 బడ్జెట్‌లో ఈ పథకాన్ని తానే ప్రకటించానని గుర్తుచేశారు. “భారతీయుల జ్ఞాపకాల నుంచి గాంధీని చెరిపేయాలని వారు ప్రయత్నిస్తున్నారు. పిల్లలకు గాంధీ గురించి తెలియకూడదు, ప్రజలు ఆయన పేరును స్మరించుకోకూడదు అన్నదే వారి ఉద్దేశం“ అని ఆయన విమర్శించారు.ఈ పథకం పేరు మార్పును కాంగ్రెస్ మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మొదట ఈ పథకానికి 'పూజ్య బాపు గ్రామీణ ఉపాధి హామీ పథకం' అని పేరు పెడతారని భావించినప్పటికీ, దానికి భిన్నంగా కొత్త పేరును ప్రతిపాదించడంపై

కాంగ్రెస్‌తో పాటు తృణమూల్ కాంగ్రెస్ వంటి ఇతర విపక్షాలు కూడా మండిపడుతున్నాయి.ఇదే సమయంలో బిల్లులకు కేవలం హిందీ పేర్లు పెట్టడంపైనా చిదంబరం స్పందించారు. వలసవాద ఛాయలను తొలగించేందుకే హిందీని వాడుతున్నామన్న ప్రభుత్వ వాదనను ఆయన తోసిపుచ్చారు. “భారత రాజ్యాంగమే ఆంగ్లంలో ఉంది. హిందీ, ఇంగ్లీష్ రెండూ అధికారిక భాషలుగా ఉంటాయని రాజ్యాంగం హామీ ఇస్తోంది“ అని ఆయన గుర్తుచేశారు.

# కబడ్డీ ప్లేయర్ హత్య కేసు: పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ప్రధాన నిందితుడు హతం

## మొహాలీలో కబడ్డీ ప్లేయర్ హత్య

### రెండు రోజులకే నిందితుడిని కాల్చి చంపిన పోలీసులు

### ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు గాయాలు



పంజాబ్‌లోని మొహాలీలో కబడ్డీ ఆటగాడి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులోని ప్రధాన నిందితుడు హర్ప్రీందర్ అలియాస్ మిద్దు పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఎదురుకాల్పుల సమయంలో తీవ్రంగా గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్లు మొహాలీ పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసు అధికారులు కూడా గాయపడ్డారు.రెండు రోజుల క్రితం సోమవారం సాయంత్రం, మొహాలీలోని సోహానా ప్రాంతంలో జరుగుతున్న కబడ్డీ టోర్నమెంట్‌లో 30 ఏళ్ల కన్వర్ దిగ్విజయ్ సింగ్ అలియాస్ రాణా బాలాచౌరియాను దుండగులు కాల్చి చంపారు. బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి అతనిపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో, రాణా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, హర్ప్రీందర్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించారు. అతడికి గతంలోనూ అనేక నేరాల్లో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ హత్యలో పాల్గొన్న మరో ఇద్దరు షూటర్లను కూడా గుర్తించారు. అమృత్‌సర్‌కు చెందిన ఆదిత్య కపూర్ అలియాస్ మఖన్, కరణ్ పాఠక్ అలియాస్ డిఫాల్టర్ కరణ్‌గా వారిని గుర్తించి, గాలింపు చర్యలు చేపట్టారు.కబడ్డీ టోర్నమెంట్లపై తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు ఓ ముఠా ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. హత్యకు గురైన రాణా... జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ జగ్గూ భగవాన్‌పురియాకు సన్నిహితుడు కావడమే ఈ హత్యకు కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు.

# 16 మంది మావోల అరెస్ట్... మావోయిస్టు పార్టీ కీలక లేఖ

- మొదటి పేజి తరువాయి

నిరాయుధంగా ఉన్న తమ వారిని అరెస్ట్ చేశారని లేఖలో ఆరోపించింది. ఈ చర్య తెలంగాణలో కొనసాగుతున్న ప్రజాస్వామ్య వాతావరణానికి ఎదురుదెబ్బ అని పేర్కొంది.రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. ఫాసిస్టు బీజేపీ రూపొందించిన 'కగార్' యుద్ధానికి మద్దతు ఇవ్వొద్దని ఈ లేఖ ద్వారా మావోయిస్టు పార్టీ విజ్ఞప్తి చేసింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'మావోయిస్టు ముక్త్', 'ప్రతిపక్ష ముక్త్' లక్ష్యాలతో ఈ యుద్ధాన్ని అమలు చేస్తోందని విమర్శించింది. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్, ఏక్ చునావ్, ఏక్ పార్టీ' వంటి నినాదాలతో దేశంలోని ఇతర పార్టీలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించింది.ఎన్నికల కమిషన్, కోర్టులు, సీబీఐ, ఎన్ఐఏ వంటి రాజ్యాంగ సంస్థలను కేంద్రం తన ఆధీనంలో పెట్టుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, దీనికి బీహార్ ఎన్నికలే తాజా ఉదాహరణ అని లేఖలో పేర్కొంది. బీజేపీ విధానాలు కేవలం కార్పొరేట్లకు మాత్రమే మేలు చేస్తున్నాయని విమర్శించింది. తెలంగాణలో ప్రశాంత వాతావరణం కొనసాగేలా చూసేందుకు ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళనలు చేపట్టాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

# స్వచ్ఛ రథం సత్ఫలితాలనిస్తోంది

- మొదటి పేజి తరువాయి

రహదారి సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన 'అడవి తల్లి బాట' కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అటవీ అనుమతుల విషయంలో పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాల కలెక్టర్లు అద్భుతమైన పనితీరు కనబరిచారని అభినందించారు. ముఖ్యంగా, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ 100 శాతం అనుమతులు సాధించడంపై ప్రశంసలు కురిపించారు.పంచాయతీరాజ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చే 'రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్' (=+ూూ)లో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచేందుకు పన్నుల వసూళ్లను డిజిటలైజ్ చేయడంపై దృష్టి

సారించాలని అధికారులను ఆదేశించారు. జూన్‌లో ఒక యూనిట్‌తో ప్రారంభమైన 'స్వచ్ఛ రథం' కార్యక్రమం నేడు 25 యూనిట్లకు చేరి సత్ఫలితాలనిస్తోందని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్లకు సూచించారు.

# పెన్ పవర్
## ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు


## కేంద్ర మంత్రి గడ్కరి ని కలిసిన పురందేశ్వరి, వెంకటరాజు



**గోపాలపురం, పెన్ పవర్, డిసెంబర్ 17.**
కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ను రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు లు కలిసి గోపాలపురం నియోజకవర్గంలోని పలు రహదారులకు సంబంధించిన సమస్యలను ఆయనకి వినతి వినతిపత్రం రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరాజు మాట్లాడుతూ తాను నియోజకవర్గ ప్రజానీకానికి ఇచ్చిన మాట ప్రకారం ఎంపీ పురందేశ్వరి సహకారంతో ఢిల్లీకి వెళ్ళడం జరిగిందన్నారు. అక్కడ కేంద్ర మంత్రిని కలిసి జాతీయ రహదారి కి సంబంధించిన కొన్ని సమస్యలను విన్నవించడం జరిగిందన్నారు. జాతీయ రహదారి కి సంబంధించి ఎనాగులపల్లి నుంచి సర్వీస్ రోడ్డు విస్తరణ, అలాగే పుల్లలపాడు వద్ద అండర్ పాస్ నిర్మాణం, నల్లజర్ల నుంచి శ్రీ లక్ష్మీ థియేటర్ వరకు సర్వీస్ రోడ్డు విస్తరణ, అచ్చన్నపాలెం నుంచి నల్లజర్ల వరకు సర్వీసు రోడ్డు విస్తరణ, అనంతపల్లి నుండి టోల్ ప్లాజా వరకు సర్వీసు రోడ్డు విస్తరణ వంటి నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి సమర్పించామన్నారు. ఈ సమస్యలపై ఆయన వెంటనే సానుకూలంగా స్పందించి ప్రతిపాదనలు శబ్దం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు అన్నారు. చేసిన ప్రయత్నం సఫలీకృతం కావడానికి సహకరించిన కేంద్రమంత్రి గడ్కరీ కి ఎంపీ పురందేశ్వరికి ఎమ్మెల్యే వెంకటరాజు కృతజ్ఞతలు తెలిపారు. అతి త్వరలోనే ఈ రహదారులకు సంబంధించిన పనులు ప్రారంభం అవుతాయి అన్నారు.

## రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి.

### జగ్గంపేట సిఐ, వై.ఆర్.కె శ్రీనివాస్




**కిర్లంపూడి, పెన్ పవర్, డిసెంబర్ 17**: రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్,వై ఆర్ కె శ్రీనివాస్,కిర్లంపూడి ఎస్సై, జి సతీష్ అన్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ,జి బిందుమాధవ్ ఆదేశాల మేరకు రౌడీ షీటర్ల కు కౌన్సిలింగ్ నిర్వహించారు. జగ్గంపేట సిఐ, వై ఆర్ కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్సై, జి సతీష్ కిర్లంపూడి మండలం పరిధిలో పోలీస్ స్టేషన్ లో నమోదు అయిన రౌడీ షీటర్ల కు సత్ప్రవర్తన, ప్రశాంత జీవన విధానం కలిగి ఉండాలని, ఎటువంటి గొడవలలో పాల్గొనరాదని , ప్రవర్తన మార్చుకొని సత్ప్రవర్తనతో ఉంటే రౌడీ షీట్స్ క్లోజ్ చేయడం జరుగుతుందని వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు.

# యదేచ్ఛగా కలప అక్రమ రవాణా

- లంచాల మత్తులో అటవీ శాఖ అధికారులు?
- ఏజెన్సీ అరణ్య సంపదకు తీవ్ర ముప్పు



**గంగవరం, పెన్ పవర్, డిసెంబర్ 17:**ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ సంపదను కాపాడాల్సిన అధికారుల అండదండలతోనే కలప అక్రమ రవాణా జరుగుతుందన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రంపచోడవరం మండలాల పరిధిలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాలు, అలాగే రైతుల భూముల నుండి తాటి, మారు జాతి కలపను అక్రమార్కులు రాత్రి%-%పగలు తేడా లేకుండా మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అటవీ శాఖకు చెందిన కొందరు అధికారులు లంచాలు తీసుకొని అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని గిరిజన సంఘాలు, గ్రామస్తులు బహిరంగంగా వాపోతున్నారు. అక్రమంగా తరలిస్తున్న కలపను ఇటుక బట్టిలకు, అలాగే విలువైన మారు జాతి కలపను సామ్ మిల్లులకు తరలిస్తున్నట్లు సమాచారం.

**తాటి చెట్ల అంతరించే ప్రమాదం**

ఈ అక్రమ రవాణా ఇలాగే కొనసాగితే కొద్ది కాలంలోనే ఏజెన్సీ ప్రాంతాల్లో తాటి చెట్లు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పలువురు గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాటి చెట్లు గిరిజనుల జీవనాధారంతో పాటు పర్యావరణ సమతుల్యతకు కూడా కీలకమైనవని వారు గుర్తు చేస్తున్నారు.

**రవాణా మార్గాలు ఇవే**

అడ్డతీగల, వై.రామవరం, రంపచోడవరం మండలాల అటవీ ప్రాంతాల నుండి మారు జాతి కలపతో పాటు రైతులకు చెందిన టేకు కలపను లారీలు, వ్యాన్లు, బొలెరో వాహనాల ద్వారా గంగవరం మండలం కొమరవరం, కుసుమరాయి గ్రామాల మీదుగా ఊట్ల గ్రామం మార్గం గుండా మైదాన ప్రాంతాలకు విచ్చలవిడిగా తరలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే రంపచోడవరం సీతపల్లి ఫారెస్ట్ సెక్షన్ల నుండి పోక్స్ పేట చెక్ పోస్ట్ మీదగా బహిరంగంగానే కలప అక్రమ రవాణా జరుగుతున్న సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే దీని అంతటికి కారణమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గంగవరం అడ్డతీగల వై రామవరం పరిసర ప్రాంతాల నుండి తాటి వాసాలు పట్టపగలే తరలించిపోతున్నారు. ఈ అక్రమ కలప రవాణాకు రాజకీయ నాయకుల ఒత్తిడి వల్లే వదిలి వెయ్యవలసి వస్తుందని పేరు చెప్పడానికి నిరాకరించిన అటవీ శాఖ అధికారి వెల్లడించారు. ఈ కలప అక్రమ రవాణాలో రాజకీయ నాయకుల హస్తం ఎంతవరకు ఉందో తెలియాల్సి ఉంది. అక్రమ రవాణా పై అటవీ శాఖ సిబ్బందికి ఎవరైనా సమాచారం అందిస్తే వ్యాపారులకు ఆ సమాచారాన్ని చేరవేసి తాత్కాలికంగా రవాణాను నిలిపివేసి అర్ధరాత్రి సమయంలో రవాణాకు అటవీ శాఖ సిబ్బంది బాటలు వేస్తున్నారు. ఈ అక్రమ కలప రవాణాలో అటవీ శాఖ సిబ్బంది చేతివాటాలపై డివిజన్ స్థాయి అధికారులు దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

**చర్యలు ఎక్కడ?**

అటవీ శాఖ చెక్‌పోస్టులు, గస్తీ వ్యవస్థలు ఉన్నప్పటికీ అక్రమ రవాణా నిర్బంధం లేకుండా సాగుతుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ కలప రవాణాపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాలు, పర్యావరణ వాదులు డిమాండ్ చేస్తున్నారు.

ఏజెన్సీ అరణ్య సంపదను కాపాడాలంటే తక్షణమే అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఈ నెల 21న రామచంద్రపురంలో
# విద్యార్థుల మెగా గ్రీవెన్స్ సెల్



**మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి**

**రామచంద్రపురం, పెన్ పవర్, డిసెంబర్ 17:**రామచంద్రపురం నియోజకవర్గంలో వివిధ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు, చదువులు పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల సమస్యల పరిష్కారం,దిశా నిర్దేశం లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ "విద్యార్థుల మెగా గ్రీవెన్స్ సెల్" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రామచంద్రపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా ఈ మెగా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, పీజీ, ఇంజనీరింగ్, మెడిసిన్ చదువులు పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులకు ఈ కార్యక్రమం ఒక మార్గదర్శకంగా నిలవనుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విద్యారంగంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చి, విద్యా వ్యవస్థ రూపురేఖలు మార్చే దిశగా రాష్ట్ర ఐటీ,మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని, అదే స్ఫూర్తితో రామచంద్రపురం నియోజకవర్గాన్ని ఆదర్శ విద్యా కేంద్రంగా, ఉద్యోగావకాశాల హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి సుభాష్ తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ,ఇంజనీరింగ్,మెడిసిన్, డిప్లొమా,ఐటీఐ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, చదువులు పూర్తి చేసి ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఈ మెగా గ్రీవెన్స్‌లో పరిష్కారం లభించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏపీ ఎడ్యుకేషన్ మోడల్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మంత్రి సుభాష్ కోరారు.

## విద్యుత్ పొదుపుపై అవగాహనకు కళాజాతా



**సీతానగరం, పెన్ పవర్, డిసెంబర్ 17:**విద్యుత్ పొదుపు వారోత్సవాలు లో భాగంగా చిరంజీవి బుర్రకథ బృందం, రావులపాలెం వారిచే బుర్రకథ రూపం లో స్థానిక ప్రజలకు విద్యుత్ పొదుపు పై అవగాహన కార్యక్రమం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సీతానగరం మండలంలోని చినకొండేపూడి నాలుగు బొమ్మల సెంటర్ లో పలు గ్రామాల్లో కొత్త దుర్గమ్మ గుడి వద్ద గ్రామ పెద్దలు ప్రజల సమక్షంలో కరెంట్ ఆదా పై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఇంధన పొదుపు పాటించి. భవిష్యత్ తరాలకు వెలుగునిద్దామని మండల ప్రజలు సహకరించాలని అన్నారు. భవిష్యత్ అవసరాలను విద్యుత్, ఇతర ఇంధన వనరులను పొదుపు చేయాల్సిన ఆవశ్యకతపై బుర్రకథలు, గేయాలు, నృత్యాలు రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యుత్ పొదుపు అనేది ఒక బాధ్యతగా చూడాలన్నారు. విద్యుత్ పొదుపు పాటించడం ద్వారా మనం సమాజానికి ఎంతో మేలు చేసినవారమం అవుతాయన్నారు. అవసరం మేరకు లైట్లు,ఫ్యాన్లు వినియోగించాలన్నారు. మరో వైపు స్టార్ రేటింగ్ ఉన్న విద్యుత్ వస్తువులు వాడటం ద్వారా పొదుపు చేయవచ్చునన్నారు. పొదుపు చేయడం సామాజిక బాధ్యతగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యుత్ శాఖ ఏఈ కె. చంద్రమోహన్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 19న లోకేశ్ నగరం లో పర్యటన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 17:**
రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మంత్రి నారా లోకేశ్ ఈ నెల 19న నగరం లో పర్యటించనున్నారు. ఈ మేరకు లోకేశ్ పర్యటన ఖరారు కావడంతో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. గత కొద్ది రోజులుగా వాయిదా పడుతూ వచ్చిన ఈ పర్యటన ఖరారు కావడంతో నగరం పసుపు తోరణాలతో ముస్తాబు వ్వుతోంది . ముఖ్యంగా ఆర్ట్స్ కళాశాల మైదానం వద్ద పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. తమ నేతకు ఘన స్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలు సన్నద్ధమవుతున్నారు.

## మల్లిపూడి నాగేశ్వరరావు దశదినకర్మలో పాల్గొన్న తుమ్మలపల్లి రమేష్

**కిర్లంపూడి,పెన్ పవర్, డిసెంబర్ 17:**జగ్గంపేట నియోజకవర్గం జనసేన పా ర్టీ ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్ జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బావ అయిన మల్లిపూడి నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. దీంతో కాకినాడలోని నాగేశ్వరరావు స్వగృహంలో బుధవారం నిర్వహించిన దశదినకర్మలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి మంగపతి పల్లంరాజు, తెలుగుదేశం టౌన్ ప్రెసిడెంట్ మల్లిపూడివీరు, మాదారపు వీరబాబు, తుమ్మలపల్లి వాసు,కాయల మణికంఠ,గోకేడ రమణ, గంధం వంశీ తదితరులు పాల్గొన్నారు



# కష్టకాలంలో మహానటికి అండగా ఎమ్మెల్యే సత్యానందరావు

**వృద్ధాశ్రమంలో పాకీజా పరామర్శ, ఆర్థిక సహాయం**



**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 17:**తెలుగు సినిమాల్లో ఒకప్పుడు వెలుగు వెలిగిన సినీ నటి వాసుకీ (పాకీజా)కు కష్టకాలంలో అండగా నిలిచేందుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముందుకొచ్చారు. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక గ్రామంలోని శ్రీరామ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న ఆమెను ఎమ్మెల్యే స్వయంగా పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలుగు సినీ పరిశ్రమకు తన ప్రతిభతో సేవలందించిన కళాకారులు చివరి దశలో నిరాశ్రయులుగా మారకూడదని అన్నారు. పాకీజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన అన్ని రకాల సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అభిమానుల ప్రేమను ఎప్పటికీ మరచిపోలేనని నటి పాకీజా భావోద్వేగంగా స్పందించారు. కష్ట సమయంలో తనను ఆదుకుంటున్న అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మండల టిడిపి అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథరావు, మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## యువత క్రీడలపై ఆసక్తి కనబరచాలి. ఎంపీపీ దుర్గారావు



**గోపాలపురం, పెన్ పవర్, డిసెంబర్ 17:.** యువత విద్యతోపాటు క్రీడల పై సైతం ఆసక్తి కనపరచాలని దేవరపల్లి మండల పరిషత్ అధ్యక్షులు కేవీకే దుర్గారావు అన్నారు. సంసద్ మహెూత్సవ క్రీడా పోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీపీ కేవీకే దుర్గారావు, జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జి దొడ్డి గర్ల సువర్ణరాజు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ నాగార్జున రావు లతో కలిసి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక ఉల్లాసము కలిగించడంతోపాటు ఆరోగ్యాన్ని ఇస్తాయి అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు క్రీడలపై దృష్టి పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సువర్ణ రాజు మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన ఎంతోమంది ప్రస్తుతం ఎంతో ఉన్నతమైన స్థితిలో ఉన్నారని అటువంటి వారిని విద్యార్థుల ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో భాగంగా పరుగు,ఖో,ఖో, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి కెఆర్ఎస్ వివి అప్పారావు, పి రవీంద్ర, బుజ్జి బాబు, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైస్ ఛాన్సలర్ ను కలిసిన బోదనేతర ఉద్యోగ సంఘం నాయకులు, సిబ్బంది.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 17.**

వెంకటరామన్నగూడెంలోని డా. వై.ఎస్.ఆర్.ఉద్యాన విశ్వవిద్యాలయం ఇన్ చార్జి వీసీగా బాద్యతలు చేపట్టిన కట్టుపల్లి ధనుంజయ రావు గారిని ఆయన కార్యాలయంలో వర్సిటీ లో ఏకగ్రీవంగా ఎన్నికోబడిన బోదనేతర ఉద్యోగ సంఘం నాయకులు ప్రెసిడెంట్ ఎమ్. చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ %వా%. వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రెటరీ ఎస్. శివ శంకర్, కోశాధికారి ఏ.నిరీక్షణ రాజ్, ఇ.రామ చంద్ర రెడ్డి, ఈ. హనుమంతు, కె వీ కె స్టాఫ్, అవుట్సోర్సింగ్ స్టాఫ్, టైమ్ స్కేలు వర్కర్స్ మరియు తదితరులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి వీసీ గారికి ఘన స్వాగతం పలికారు. ధనుంజయ రావు మాట్లాడుతూ ఆయనకి ఎంతో సంతోషంగా ఉంది అని మరియు తన పట్ల మరింత బాధ్యత పెరిగినట్టు వివరించారు. అందరూ అంకిత భావం తో పని చేస్తు ఉద్యాన వన యూనివర్సిటీని ప్రగతి పథంలో తీసుకువెళ్లిలి అన్నారు.

## జనసేన సిద్ధాంతాలపట్ల నిబద్ధత ముఖ్యం. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 17.**

జనసేన రాజకీయ సిద్ధాంతాల పట్ల నిబద్ధత ఉన్నవారే పార్టీలో పని చేయాలని, తాత్కాలిక ప్రయోజనాలను ఆశించవద్దని స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం మెట్ట ఉప్పరగూడెం గ్రామానికి చెందిన బహుజన పేట అంబేద్కర్ యూత్ సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు 60 మంది జనసేన నాయకుడు పైబోయిన వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉందా లేదా అనే దానితో నిమిత్తం లేకుండా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రోడ్లు నిర్మిస్తున్నామని, అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డైమండ్స్ లయన్స్ పూర్వ అధ్యక్షులుకు సన్మానం.



**డైమండ్స్ సేవలు స్ఫూర్తి దాయకం.**

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ డిసెంబర్ 17.**తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ సేవలు స్ఫూర్తి దాయకం అని ఈసమాజానికి లయన్స్ క్లబ్స్ అందిస్తున్న సేవలు అభినందనీయం అని రీజియన్ చైర్ పర్సన్ లయన్ సుంకర శ్రీనివాస్ అన్నారు.

డైమండ్స్ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు లయన్ కాళ్ళ గోపి కృష్ణ అధ్యక్షతన వశిష్ఠ ఎంటర్ ప్రైజెస్ కార్యాలయం వద్ద డైమండ్స్ లయన్స్ క్లబ్ సమావేశం పాస్ట్ ప్రసిడెంట్స్ హానరింగ్ కార్యక్రమం లో ముఖ్య అతిథి గా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలనుండి డైమండ్స్ లయన్స్ క్లబ్ జిల్లా లో అత్యన్నత సేవలు అందిస్తూ బెస్ట్ క్లబ్ గా ఉందని అందుకు కారకులైన టీం వర్క్ చేస్తున్న సభ్యులుకు అభినందనలు తెలిపారు

పునః ప్రారంభం చేసిన క్లబ్ ప్రసిడెంట్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు తో పాటు పూర్వపు అధ్యక్షులు లయన్ కోనా హనుమాన్ బాబు.లయన్ కొప్పిశెట్టి రమణయ్య లయన్ ఇంద్రవాణి లియో లయన్ మాధురి మండే లను శాలువలతో సన్మానించి లయన్ కాళ్ళ కార్తీక్ ధర్మతేజ, కాళ్ళ గోపి కృష్ణ అందించిన జ్ఞాపికలు లయన్ సాయిరాం అందించిన పెన్ సెట్ లను పూర్వపు అధ్యక్షులు కు అందచేసారు. వైస్ ప్రసిడెంట్ కాళ్ళ గోపి కృష్ణ మాట్లాడుతూ డైమండ్స్ లయన్స్ కు ఇంతంటి పేరు ప్రఖ్యతలు తెచ్చిన పూర్వపు అధ్యక్షులు అందరిని గౌరవించాలని 316జి జిల్లా గవర్నర్ లయన్ ఎన్ వివియస్ పాపా రావు నాయుడు పిలుపు మేరకు అంతర్జాతీయ గైడ్ లైన్స్ ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు..ఈకార్యక్రమం లో పాస్ట్ ప్రసిడెంట్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ సమిష్టి కృషి మానవత్వం తో సమాజానికి అవసరం ఐన సేవలు అందిచామని రాబోయే కాలం లో ఇదే స్ఫూర్తి తో అందరూ సమిష్టి గా సేవలు అందించాలని యువత జాతీయతా భావం తో సమాజ సేవలో ముందుండాలి అని అన్నారు తొలుత లయన్స్ క్లబ్స్ వ్య వస్థాపకులు లయన్ మెల్విన్ జోన్స్ చిత్ర పఠానికి పులామాలలు వేసి నివాళులు అర్పించారు. డైమండ్స్ సభ్యులు లయన్ చెన్నారెడ్డి సతీష్.జొన్నల సతీష్ కుమార్, ఆకుల సతీష్ నాయుడు,తమ్మా బత్తుల సత్యనారాయణ మానే బలరామకృష్ణ వరప్రసాద్ కొత్త సుభద్ర యర్రా ఆంజనేయ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. వడ్డీరఘురాం నాయుడు

**దివ్యాంగుల జిల్లా స్థాయి సదస్సు 10000 ఆర్థిక సాయం.**

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 17.**దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వడ్డీ రఘురాం నాయుడు అన్నారు. బుధవారం తాడేపల్లిగూడెంలోని వడ్డీ నివాసంలో జిల్లాస్థాయి దివ్యంగా నాయకులు వడ్డీ రఘు రామ్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఈ నెల 20వ తేదీన తాడేపల్లిగూడెం దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరుగు జిల్లా స్థాయి సదస్సు కు ముఖ్య అధితిగా రాష్ట్ర వైసీపీ పార్టీ ఆక్వా కల్చర్ వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డీ రఘురామ్ నాయుడును ఆహ్వానించారు వారి ఆహ్వానం మేరకు వడ్డీ సానుకూలంగా స్పందించారు సంఘ జిల్లా నాయకులు.

వారి సమస్యలు విని వాటి పరిస్కారం కొరకు తాను తప్పక కృషిచేస్తానని హమి ఇచ్చి 20వ తారీకున జరగనున్న కార్యక్రమానికి రు 10000/- (పదివేలరూపాయలు)ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వడ్డీ రఘురాం నాయుడు మాట్లాడుతూ దివ్యాంగులకు వైసీపీ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు.



## క్రీడా వికాస కేంద్రాల అభివృద్ధికి కృషి

**శాప్ డైరెక్టర్ జగదీశ్వరి**



**గోపాలపురం/పోలవరం, పెన్ పవర్, డిసెంబర్ 17.**

క్రీడా వికాస కేంద్రాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని రాష్ట్ర క్రీడ సాధికారత సంస్థ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. పోలవరం నియోజకవర్గం లోని కోట రామచంద్రపురం, జీలుగుమిల్లి గ్రామాలలో ఉన్న క్రీడా వికాస కేంద్రాలను అధికారులతో కలిసి జగదీశ్వరి బుధవారం సందర్శించారు. అక్కడ ఉన్న భవన సముదాయం, క్రీడా మైదానంలో ఉన్న పిచ్చి మొక్కలు, గడ్డి వంటి వాటిని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర క్రీడ సాధికారత అధ్యక్షులు రవి నాయుడు ఆదేశాల మేరకు తాను ఈ క్రీడా వికాస కేంద్రాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఇక్కడ సమస్యల్ని అధికారులతో కలిసి గుర్తించామన్నారు. కొన్నిచోట్ల భవనాలు ఇబ్బందికరంగా ఉన్నాయని, అలాగే విద్యార్థుల పలు సమస్యల్ని తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు.అయితే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి పరచాలని ఎన్నో కార్యక్రమాలను ప్రవేశపెడుతుందన్నారు. క్రీడా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన వంటి వాటిపై దృష్టి పెడుతుంది అన్నారు. క్రీడాకారులు ప్రభుత్వం అందించే అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ క్రీడలలో రాణించాలన్నారు. జగదీశ్వరి వెంట ఏలూరు జిల్లా టెలికాం డైరెక్టర్ షేక్ సుభాని, జిల్లా క్రీడా సాధికారిక అధికారి అజీజ్, రాష్ట్ర క్రీడ సాధికారత ఇంజనీర్ ప్రశాంత్, అనిల్, ఓటమి నాయకులు ఉప్పాటి, రాజు, చిన్న బాబు, కొవ్వాసు శ్రీను, పోతురాజు, నరేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అంగన్వాడీ ఆయా కుటుంబం



**కొవ్వూరు, పెన్ పవర్, డిసెంబర్ 17:**మండలంలోని చిడిపి గ్రామానికి చెందిన ప్రత్తిపాటి వెంకటలక్ష్మి అంగన్వాడీ ఆయగా పని చేస్తూ తనకు వచ్చిన జీతంలో నుండి కొంత తన తల్లిదండ్రులు కొయ్య అప్పారావు, మరియమ్మ ల జ్ఞాపకార్ధముగ పలు సేవా చేస్తున్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా 3 వేల రూపాయలతో చిడిపి గ్రామం అంగన్వాడీ కేంద్రానికి బాత్ రూమ్ డోర్, గడియారం, గ్రామ ప్రజలు ప్రయాణ సౌకర్యార్థం 10 వేల రూపాయలతో సిమెంట్ బల్లలు, ఏర్పాటు చెయ్యడం జరిగింది. తన కుమారుడు ప్రత్తిపాటి నాగరాజు ద్వారా దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సమాజామే కుటుంబముగ పలు సేవాకార్యక్రమాలు చెయ్యడానికి తన కుమారుడిని నిరంతరం ప్రోత్సహిస్తూ సహాయం అందిస్తున్నారు. సమాజం మనకు ఏమి ఇచ్చింది అని కాకుండా మనం సమాజానికి ఏమి చేసాం అనే మంచి సంకల్పంతో కుటుంబ సమేతంగా సమాజానికి సేవ చేస్తున్నారు. చిడిపి గ్రామంలోని అంగన్వాడీ ఆయా ప్రత్తిపాటి వెంకటలక్ష్మి కుటుంబాన్ని అంగన్వాడీ సూపర్వైజర్ యాడంగి భాగ్యకుమారి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్త కొయ్య దమయంతి, అంగన్వాడీ టీచర్ అక్కాబత్తుల నానెమ్మ, దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ప్రత్తిపాటి నాగరాజు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా 13 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 17.** తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు బుధవారం సీఎం సహాయనిధి నీ యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ చేతుల మీదగా సుమారు 13 లక్షల రూపాయలు 23 చెక్కులు మండల అధ్యక్షులు ద్వారా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ ప్రజల మనిషి, సేవాతత్పరులు బోలిశెట్టి శ్రీనివాస్ పార్టీలకు అతీతంగా చేస్తున్న సేవలు నియోజకవర్గ ప్రజల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుండి నేటి వరకు మూడు కోట్ల 80 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ ను నియోజకవర్గ ప్రజలకు అందించి ప్రజలను ఆదుకోవడం తో పాటుగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం జనసేన మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, పెంటపాడు మండలం జనసేన పుల్లా బాబి, చాపల రమేష్, పై ఎర్ర వెంకటరామయ్య,వాడపల్లి సుబ్బరాజు, కిలపర్తి వెంకట్రావు, పాలూరి వెంకటేశ్వరరావు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు

# ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

**సచివాలయ కార్యదర్శులతో ఎంపీడీవో హరికృష్ణ సత్య రెడ్డి**

**గండేపల్లి, పెన్ పవర్ డిసెంబర్, 17:**ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సచివాలయ కార్యదర్శులకు స్థానిక ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి సూచించారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిధిలోని మురారి, గండేపల్లి, సింగర్ పాలెం, ఎన్ టి రాజా పురం సచివాలయం కు చెందిన పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతోపాటు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వం అందించే పథకాలను చేరేలా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందాలన్నారు. కనుక ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తిరిగి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ ఫలాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏవో చంద్రరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయం సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆరోగ్య కేంద్రాలకు నిధులు కేటాయింపు



**జీలుగుమిల్లి, పెన్ పవర్, డిసెంబర్ 17:** పోలవరం నియోజకవర్గ పరిధిలో ఉన్న 75 ఆరోగ్య కేంద్రాలకు రూ 20 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేయడంపై పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జీలుగుమిల్లిలో జి ఆర్ కె జనసేన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు .బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు 5 జి స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. అంగన్వాడి కార్యకర్తలు సమర్థవంతంగా సేవలందించేందుకు, క్షేత్రస్థాయిలో నివేదికలు వేగంగా పంపించేందుకు, పిల్లల ఆరోగ్య సమాచారం, పోషకాహార స్థితిని సులభంగా నమోదు చేసి పర్యవేక్షించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్, జీలుగుమిల్లి ,బుట్టాయిగూడెం మండల అధ్యక్షులు పసుపులేటి రాము, మెట్ట బుచ్చిరాజు ,నాయకులు మద్ద తేజ, పద్దం వెంకటకృష్ణ, చెర్రీ శ్రీను, కోన కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# 20 కుటుంబాలు బిజెపిలో చేరిక



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, డిసెంబర్ 17:** కామయ్యపాలెంలో వివిధ పార్టీల నుండి సుమారు 20 కుటుంబాలు బిజెపి లో జాయిన్ అయ్యారని బిజెపి రాష్ట్ర కమిటీ సభ్యురాలు బొరగం వెంకటలక్ష్మి, జిల్లా నాయకులు చాట్రాతి ప్రసాదు తెలిపారు .బుధవారం కామయ్యపాలెంలో పేరం జగదీష్ ఇంటి వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ సూపరీ ఈ పాలన నచ్చి బిజెపిలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈనెల 22న ఏలూరులో మాజీ ప్రధాని వాజ్పేయి విగ్రహావిష్కరణకు బిజెపి శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు గుడ్ల రాంబాబు, కార్యదర్శులు పీవీ సుబ్బారెడ్డి, పి బాలు ఉపాధ్యక్షులు ఏ సోమిరెడ్డి, బిసి మోర్చా అధ్యక్షులు గడ్డం రామకృష్ణ, ఎస్టీ మోర్చా సూర్యచంద్రన్, కిరణ్ ,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులను చిన్నచూపు చూడరాదు: డాక్టర్ మోహిత్ సీత



**ఆత్రేయపురం, పెన్ పవర్ డిసెంబర్ 17:**ప్రత్యేక ప్రతిభావంతులను చిన్నచూపు చూడకుండా సరైన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే వారు అద్భుతాలు సాధిస్తారని లండన్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మోహిత్ సీతలు అన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల భవిత కేంద్రంలో సామ్ అడ్వాన్స్ ఫిజియోథెరపీ రిహాబిలిటేషన్ సెంటర్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఫిజియోథెరపీ టెక్నిక్స్ ద్వారా ప్రత్యేక అవసరాలున్న పిల్లల్లో శారీరక, మానసిక అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తే పిల్లలలోని ప్రతిభ వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి, వారికి ఉపయోగపడే విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో లొల్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.ఎన్. వాసుకి, ఉపాధ్యాయులు సాయిరాం, గోవిందు, ఐఈఆర్టీ ఉపాధ్యాయురాలు అరుణ, జానకి తదితరులు పాల్గొన్నారు.

## కోరుకొండ పంచాయతీ సెక్రటరీగా డివి నాగరత్నం..

**కోరుకొండ, పెన్ పవర్,డిసెంబర్ 17:** కోరుకొండ గ్రామపంచాయతీ సెక్రటరీగా ఉన్న రమేష్ బాబు పదోన్నతిపై బదిలీ అయ్యారు. బుధవారం ఉదయం ఆయన స్థానంలో డి వి నాగరత్నం విచ్చేశారు. ఈ సందర్భంగా కోరుకొండ గ్రామంలో ఉన్న నాయకులు కార్యకర్తలు పంచాయతీ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలియజేశారు.



# గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ముందడుగు ఎమ్మెల్యే సత్యానందరావు

**ఆత్రేయపురం, పెన్ పవర్ డిసెంబర్ 17:**ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం ఆత్రేయపురం మండలంలో రూ.1.17 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు.

మెర్లపాలెం గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులు 23.60 లక్షలతో నిర్మించనున్న ఓవర్ హెడ్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆత్రేయపురంలో ఏపీ ఎస్ఎస్ నిధులు రూ.53 లక్షలతో నిర్మించనున్న మండల విద్యాశాఖ అధికారి భవనానికి శంకుస్థాపన నిర్వహించారు. తరువాత వద్దిపర్రు గ్రామంలో ప్రధానమంత్రి గ్రామీణ యోజన నిధులు రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే బొబ్బర్లంక గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.20.50 లక్షలతో నిర్మించనున్న మరో ఓవర్ హెడ్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. చేపట్టిన పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



ఈ కార్యక్రమంలో వాడపల్లి ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), కాయల జగన్నాధం, ముళ్లపూడి భాస్కరరావు, మండల టిడిపి అధ్యక్షులు కుసంపూడి రామకృష్ణంరాజు, సర్పంచులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 70 సం.లు పై బడిన , పోలీసులను సన్మానించిన జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 18:** పెన్షన్ దినోత్సవం సందర్భంగా స్థానిక జాంపేట పోలీస్ కన్వెన్షన్ హాల్ నందు బుధవారం పోలీసు శాఖలో ఉద్యోగ విరమణ పొందిన 70 సంవత్సరములు నిండిన పోలీస్ అధికారులు,పోలీసులను తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ సన్మానం చేశారు. జిల్లా ఎస్పీ సన్మానించిన వారిలో సి ఐ కె.సాల్మన్ రాజు, ఎస్ఐ యు వి వి సత్యనారాయణ, ఎస్ ఐ కె.నరసింహ స్వామి, ఎస్సై డి.ఎస్. ప్రకాష్ రావు, ఎస్సై జి. నాగేశ్వరరావు, ఎస్సై సంతేశ్వరరావు, ఏఎస్ఐ కె. ఎస్. ఎన్. రాజు, ఏఎస్ఐ కె.రామకృష్ణ, హెచ్ సి కె. కుమార్ రావు, హెచ్ సి డి.రామచంద్రరావులను ఎస్పీ సన్మానం చేసారు . ఈ సన్మాన సభలో అడిషనల్ ఎస్పీ ఎన్. బి. మురళీకృష్ణ , జిల్లా ట్రెజరీ డి టి ఓ డి. సత్యనారాయణ, రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షరీఫ్, వైస్ ప్రెసిడెంట్



సూర్యనారాయణ, సెక్రెటరీ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేకాట క్లబ్బుల నిర్వహకుడికి పవిత్ర కోటిలింగాల ఆలయ చైర్మన్ పదవి




- ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణి ప్రాణాలు తీసిన వైద్యుల నిర్లక్ష్యం
- అనాథ పసికందుకి ప్రభుత్వం కోటి నష్టపరిహారం చెల్లించాలి
- మీడియా సమావేశం లో వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ విమర్శ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 17:**ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక గర్భిణీ కి సకాలంలో, మెరుగైన వైద్య చికిత్స అందించడంలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల ఆమె ప్రాణాలు పోవడమే కాకుండా, ఆమె బిడ్డ అనాథగా మారిందని వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ అవేదన వ్యక్తం చేసారు. స్థానిక వైసిపి కార్యాలయం లో బుధవారం ఆయన మీడియా సమావేశం లో మాట్లాడుతూ,

ఈ ఘటనపై ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రసూతి సమయంలోను, ప్రసవం అనంతరం ఇద్దరు డ్యూటీ డాక్టర్ ల నిర్లక్ష్యం వల్ల ఆమె ప్రాణాలే పోయాన్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, ఆస్పత్రు ల మీద ఉన్న శ్రద్ధ ప్రభుత్వ ఆసు పత్రుల మీద, పేద ప్రజల ప్రాణాల మీద కూటమి ప్రభుత్వానికి పట్టింపు లేదని విమర్శించారు. తల్లిని కోల్పోయి అనాథ అయిన ఈ పసికందుకు కోటి రూపాయల నష్టపరిహారం పాప పేరు మీద ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెల్లించాలని డిమాండ్ చేసారు. తాను ఎంపీగా ఉండి చేసిన కృషి వల్ల పూర్తయిన మోరంపూడి ఫ్లై ఓవర్ కు సుమారు రెండు ఏళ్ల తర్వాత లైట్లను ఏర్పాటు చేయడం పట్ల జిల్లాలోని ఐదుగురు ప్రజాప్రతినిధులకు ఆయన ధన్య వాదాలు తెలిపారు. రోడ్డు ప్యాచ్లు పనులు చేయడం కూడా ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకోవడాన్నీ ఆయన ఎద్దేవా చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజ్ పనుల సమీక్ష సమావేశం లో నగర ఎంఎల్ ఏ మాట్లాడుతూ పి పి పి మోడ్ దేశంలో వడోదర అనే రాష్ట్రంలో జరిగిందని చెప్పడం చూస్తే వడోదర అన్నది రాష్ట్రం కాదని, సిటీ అని ఈ ఎమ్మెల్యే తెలియటం లేదన్నారు. ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ రికవరీ కోసం ఒక ఇంటికి వెళ్లిన ఏజెంట్ ను తొలుత ఇంట్లో కొట్టరని, మళ్ళీ బయటకు వచ్చి చితకొట్టారన్నారు. అనంతరం రికవరీ ఏజెంట్ మనుషులు కొట్టిన వాళ్లను తిరిగి కొట్టడం జరిగిందన్నారు. దాడుల సంస్కృతిని తాను ఖండిస్తున్నన్నారు. నగర ఎమ్మెల్యే వక్రీకరించి తన మీద బురద జల్లాలనే దుర్బుద్ధితో ఘటనను పరిష్కరించాలని యత్నాలు చేసిన తన మిత్రుడు సుభాని మీద ఫిర్యాదు, ఎఫ్ఐఆర్ ల్లో పేరు లేకపోయినా పోలీసులపై ఒత్తిడి తెచ్చి మరల ఎఫ్ఐఆర్ లో అతని పేరు రాయించి రిమాండ్ కి పంపించే ప్రయత్నం చేసారని విమర్శించారు. .

తన అనుచరుల పాత్ర ఉందని బురద జల్లడం పనికిమాలిన రాజకీయ మన్నారు. తదనంతరం మహిళలతో ప్రెస్ మీట్ లో పాల్గొన్న ఒక మహిళ గట్టిగా ఏడవండి అనడంతెలుగుదేశం పార్టీ నీచ సంస్కృతిని బయట పెడు తుందన్నారు. దొంగ సామాన్లు అమ్మే మార్వాడీలు గో బ్యాక్ అని వ్యాఖ్యా నాలు చేసి విమర్శలు పాలైన దొండపాటి సత్యం బాబు తమ ప్రభుత్వంలో అతని అల్లుడు బలవన్మరణం చెందితే విచారణ చేసి ఉంటే మరో రకంగా ఉండేదన్నారు.

దక్షిణ కాశి గా ప్రసిద్ధి పొందిన కోటిలింగాల దేవస్థానానికి పేకాట క్లబ్బు నిర్వహించే ఒక మాజీ కార్పొరేటర్ ని చైర్మన్ పదవిని నగర ఎమ్మెల్యే కట్ట బెట్టరని విమర్శించారు. ఈ నియామకం పవిత్రమైన హిందూ సాంప్రదాయాన్ని మంట కలిపిం దన్నారు. సర్వే నెంబరు 612 భూమి కబ్జాకు గురైందని ఒక వ్యక్తి చేసిన ఆరోపణపై వివరణ ఇచ్చేందుకు భరత్ స్పందిస్తూ 420 వ్యక్తుల ఆరోపణలకు ఆరోపణలకు సమా ధానం ఇచ్చేది లేదన్నారు. ఈ సమావేశంలో వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# కడియం మండలంలో రూ.8.50 కోట్లతో రోడ్లు అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 17:**కడియం మండలంలో రూ.8.50 కోట్ల వ్యయంతో పంచాయతీ రహదారుల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు రూరల్ నియోజకవర్గ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. బుధవారం కడియపులంక గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా కడియం మండలంలో రూ.8.50 కోట్లు, వేమగిరిలో రూ.80 లక్షలతో డ్రైనేజ్ పనులు, దామిరెడ్డి పల్లెలో రూ.1.50 కోట్లతో రహదారి పనులు, కడియం – వేమగిరి రహదారి అభివృద్ధికి రూ.1.90 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కడియం మండల పరిధిలో మొత్తం రూ.10 కోట్ల విలువైన ఆర్ అండ్ బి పనులు త్వరలో ఆయా పనులు ప్రారంభ మవుతాయని తెలిపారు. కడియ పులంక గ్రామంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయడం జరిగిందని, చుట్టుపక్కల ఆరు గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించనున్నట్లు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. నూతన పీహెచ్‌సీ భవనాన్ని సంవత్సరం లోపే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. భవన నిర్మాణానికి అదనంగా మరో రూ.50 లక్షల నిధులు సమకూర్చే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.బుధవారం కడియపులంక గ్రామంలో దోసలమ్మ కాలనీ సమీపంలో నూతన ప్రభుత్వ హాస్పిటల్ భవన నిర్మాణానికి, కడియపుసావరం గ్రామంలో పంచాయితీ నిధులతో నూతనంగా నిర్మించనున్న షాపులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు.

అన్నం దేవుల రామ సూర్య సీతామహాలక్ష్మి వారి పేరు మీద స్థలం మంజూరు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్నందేవుల గంగాధరం, పార్వతి, దినేష్ తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి వారిని అభినందించారు. ఈ కార్యక్రమాల్లో మండల అధికారులు , ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్ మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం సర్పంచ్ మారిశెట్టి పద్మావతి ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గం సత్యనారాయణ ఏఎంసీ వైస్ చైర్మన్ బోడపాటి గోపి సొసైటీ అధ్యక్షులు గట్టి నరసయ్య గట్టి సుబ్బారావు కలిదిండి గోవిందు బొరుసు సుబ్రమణ్యం, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మందేశ్వర స్వామి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట,పెన్ పవర్, డిసెంబర్17:**కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో వేంచేసి యున్న ప్రముఖ దివ్య క్షేత్రం మందపల్లి శ్రీ మందేశ్వర (శనీశ్వర)స్వామి దేవస్థానం ప్రచురించిన 2026 క్యాలెండర్ ను బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాలకమండలి సభ్యులతో కలిసి వాడపాలెం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. స్వామివారి ఆశీస్సులు అందరిమీదా ఉండాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త గోవా గవర్నర్ శ్రీ పూసపాటి అశోక్ గజపతి రాజును ఆలయానికి ఆహ్వానించి చరిత్రలో నిలిచిపోయేలా బ్రహ్మాండమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గౌరవించుకునేందుకు తగిన ఆలోచన చేసి ముందుకు వెళదామని గ్రామస్తులతో ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. అందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆలయ అధికారులకు, గ్రామస్తులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఈవో సురేష్, చింతం కృష్ణ,ధరణాల రామకృష్ణ,సిద్ధంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య యూనివర్సిటీ లో "రక్త దాన శిబిరం"




**గండేపల్లి , పెన్ పవర్ డిసెంబర్, 17:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం లోని ఫార్మసీ విభాగం మరియు లయన్స్ క్లబ్, కాకినాడ వారు సంయుక్తంగా "రక్త దాన శిబిరం" నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో-చాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి పాల్గొనగా, ముఖ్య అతిధులుగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్, జె.ఎన్.టి.యు.కె ప్రొఫెసర్, డాక్టర్ పి. ఉదయ భాస్కర్, మరియు జెన్.ఎన్.టి.కె మాజీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్, డాక్టర్ జి వి ఆర్ ప్రసాద రాజు , పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో 100 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు మరియు అధ్యాపకులు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం అతిధులను ఆదిత్య యూనివర్సిటీ తరపున డా. ఎన్. సతీష్ రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవిశంకర్, స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్. డా. డి. సతీష్ కుమార్, డీన్ . డి.కిషోర్, రెడ్ క్రాస్ నుండి డా. పరాశం, లయన్స్ క్లబ్ కాకినాడ ప్రతినిధి బృందం, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రశాంతి, పరిణయ శ్రీ పాల్గొన్నారు,

## తండ్రి ఆదర్శంతో పోలీసుగా కుమార్తె...



**కాత్రేనికోన పెన్ పవర్ డిసెంబర్ 17:**కాత్రేనికోన మండలం నడవపల్లి గ్రామం లో చిన్ననాటి నుంచి ఆమె తండ్రి పోలీసుగా దొంగలను పట్టుకోవడం దగ్గరి నుంచి గమనించిన ఆ చిన్నారి తను కూడా పెద్దయ్యాక తన తండ్రిలాగే ఎప్పటికైనా పోలీస్ కావాలని చిన్నప్పుడే నిశ్చయించుకుని పెద్దయ్యాక పోలీస్ అయ్యింది. కాత్రేనికోన మండలం నడవపల్లి కి చెందిన సంసాని జ్యోతి డిగ్రీ వరకు చదివింది. ఆమె తండ్రి సంసాని శ్రీనివాసరావు కాత్రేనికోన పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్నారు. తల్లి సత్యవేణి గృహిణి. తండ్రిలా పోలీస్ కావాలని లక్ష్యంతో ఎస్సై ఉద్యోగానికి ప్రయత్నించి త్రుటిలో అవకాశం కోల్పోయింది. అయినా కుంగిపోకుండా, పట్టు వదలకుండా కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రయత్నించింది. మూడు ఏళ్ల కాలం నుంచి ఎటువంటి కోచింగ్లకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటూ అహర్నిశలు కష్టపడి చదివింది. ఆగస్టులో వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో సివిల్ కానిస్టేబుల్ గా విజయం సాధించింది. మంగళవారం అమరావతి లో నిర్వహించిన కార్యక్రమంలో తల్లిదండ్రుల సమక్షంలో ఉద్యోగ నియామక పత్రం అందుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి లాగానే పోలీసు శాఖలో పనిచేసి ప్రజలకు, సమాజ సేవ చేయాలని తపనతో ఈ ఉద్యోగం సాధించానని జ్యోతి తెలిపింది. ఎప్పటికైనా ఎస్సై ఉద్యోగం సాధిస్తానని తెలిపింది. చిన్ననాటి నుంచి కన్నా కలను సాధించి పోలీసు శాఖలో అడుగుపెడుతున్నందుకు సంతోషం వ్యక్తం చేసింది. నిజాయితీగా ప్రజలకు సేవలు అందిస్తాను అని తెలిపింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు గ్రామస్తులు అభినందించారు...

## విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా ర్యాలీ

* చింతూరులో అవగాహన కార్యక్రమాలు




**చింతూరు, పెన్ పవర్ డిసెంబర్ 17:**విద్యుత్ భద్రత వారోత్సవాలలో భాగంగా చింతూరులో సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతూరు ఐటిడిఎ కార్యాలయం నుంచి చింతూరు సెంటర్ వరకు విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారులు కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ శుభం నక్వాల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం డివిజన్ డీఈ బి. వెంకటరమణ, చింతూరు ఏడీఈతో పాటు ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా విద్యుత్ భద్రతా నియమాలు పాటించాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం చింతూరు ఈపిడిసిఎల్ సబ్ డివిజన్ కార్యాలయంలో పీఎం సూర్యఘర్ రూఫ్‌టాప్ సోలార్ కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సోలార్ విద్యుత్ ప్రాముఖ్యత, ప్రభుత్వ సబ్సిడీలు, బ్యాంకుల ద్వారా లోన్లు ఎలా పొందాలనే అంశాలపై వినియోగదారులకు వివరించారు. రంపచోడవరం డీఈ ఆధ్వర్యంలో నేరుగా బ్యాంకు మేనేజర్లతో వినియోగదారుల ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేసి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో చింతూరు ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ మేనేజర్, సోలార్ వెండర్లు, చింతూరు ఏడీఈ, ఏఈ గణేష్‌తో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రజల్లో మంచి స్పందన కనిపించిందని అధికారులు తెలిపారు.

## పెన్షన్ డే ను ఘనంగా నిర్వహించిన విశ్రాంత ఉద్యోగులు.



**ఏలేశ్వరం, పెన్ పవర్,డిసెంబర్ 17:** పెన్షన్ డే ను విశ్రాంతి ఉద్యోగులు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కాలేజీ రోడ్లో గల పెన్షనర్స్ అసోసియేషన్ బిల్డింగు లో విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వి రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆనాడు ధర్మ స్వరూప్ నఖరా ద్వారా సుప్రీంకోర్టు పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు తీర్పు డిసెంబర్ 17వ తేదీ 1982 సంవత్సరంలో వెలువడి నుండి ప్రతి సంవత్సరం పెన్షన్స్ డే జరుపు కుంటున్నట్లు విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వి. రామచంద్రరావు అన్నారు. అలాగే కార్యదర్శి ఏవి ప్రసాద్ సలహా కమిటీ సభ్యులు సీనియర్లు జహీరుద్దీన్,వి. ఎస్.అస్మాన్, నఖరా గూర్చి పలు విషయాలు వెల్లడించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కోశాధికారి తాతారావు ఇబ్రహీం ఖాన్లు సంఘము యొక్క ఐక్యత గురించి వివరించారు. సంఘం మాజీ కార్యదర్శి జోగురాజు మాట్లాడుతూ పెన్షన్స్ అడిషనల్ కౌంటర్ సప్లిన్స్ గూర్చి వివరంగా తోటి ఉద్యోగులకు అర్థం అయ్యే రీతిలో వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పెన్షనర్స్ సానా వెంకటేశ్వరరరావు, వేమరుపాక నారాయణరావు కుటుంబ పెన్షన్ దారులైన ఆర్ భూషణమ్మ ,వై సుశీల లను ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం విశ్రాంతి ఉద్యోగులంతా జనగణమన గేయంతో కార్యక్రమాన్ని ముగించారు.

# రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో 170 రగ్గులు పంపిణీ

**కాకినాడ, పెన్ పవర్, డిసెంబర్ 17:**రామక్రిష్ణ మిషన్ రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో బుధవారం కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లి మండలంలో మత్స్యకార గ్రామాలైన రామన్నపాలెం , పొన్నాడ , మూలాపేట, ఉప్పాడ , కొత్తపల్లి గ్రామల్లో వృద్ధులు , వితవంతువులు , వికలాంగులకు 170 రగ్గులు పంపిణీ చేసినట్లు రామకృష్ణ మిషన్ రాజమండ్రి కార్యదర్శి స్వామి పరిజ్ఞేయా నందజి మహారాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ రాజమండ్రి ధర్మ వైద్యశాల ఇన్చార్జి స్వామి లోకమయానందా జీ మాట్లాడతు శివ జ్ఞాన్ జీవ సేవ అనే వివేకానంద స్వామి స్ఫూర్తితో ప్రతి మనిషిలో ఉన్న భగవంతున్నికి సేవ చెయ్యాలని రామక్రిష్ణ మిషన్ కృషీ చేస్తున్నట్లు స్వామిజీ అన్నారు , ఈ కార్యక్రమంలో రామక్రిష్ణ సేవా సమితి సభ్యులు మహాలక్ష్మి , సోమ శేఖర్ ,. అప్పారావు , గుండారపు శ్రీ రామ చంద్రమూర్తి , డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ సరోజిని , రామక్రిష్ణ మిషన్ రాజమండ్రి సిబ్బంది పాల్గొన్నారు.




## శాంతివర్ధనా విభిన్న ప్రతిభావంతుల పాఠశాల అధినేతలు సేవలు అభినందనీయం



* జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్.

**కిర్లంపూడి,పెన్ పవర్,డిసెంబర్ 17:** పెద్దాపురం మండలం పులిమేరు శాంతి వర్ధనా విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాల అధినేతలు, రాయవరపు వీరబాబు, రాయవరపు సత్య విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు.

పెద్దాపురం మండలం పులిమేరు గ్రామంలో ఉన్న శాంతివర్ధనా విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామ జనసైనికుడు పెన్నమరెడ్డి చంటిబాబు బుధవారం మధ్యాహం భోజనాలు ఏర్పాట్లు చేసారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్యఅతిధిగా హాజరై విద్యార్థులకు స్వయంగా భోజనాలు వడ్డించారు.ఈ సందర్బంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ జనసైనికుడు చంటిబాబు ఇలాంటి మంచి కార్యక్రమం చేపట్టి అందులో నన్ను భాగస్వామ్యం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. మిగతా జనసైనికులు కూడా తమ పెళ్లి, పుట్టిన రోజులు వంటి శుభాకార్యాలప్పుడు ఇలాంటి కార్యక్రమాలు చేయాలని, మానవ సేవయే మాధవ సేవ అని అన్నారు.విభిన్న ప్రతిభావంతులకు శాంతివర్ధనా అధినేతలు రాయవరపు వీరబాబు, రాయవరపు సత్య అందిస్తున్న సేవలను ప్రత్యేకించి అభినందించారు.ఈ కార్యక్రమంలో పెన్నమరెడ్డి చంటిబాబు కుటుంబ సభ్యులు,వీరబాబు,మాదారపు వీరబాబు గోకేడ రమణ, గంధం వంశీ,ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు

# చదువు తోనే సమాజం లో ఉన్నత హెూదా

మత్తు పదార్థాల పై విద్యార్థులు కు అవగహన

సీఐ ప్రశాంత్ కుమార్

**అల్లవరం,పెన్ పవర్, డిసెంబర్ 17:**చదువే మీ జీవితాల్లో వెలుగులు నిపుతుందని,చదువుపట్ల అశ్రద్ధ చేయవద్దని విద్యార్థులకు సిఐ ప్రశాంత్ కుమార్ సూచించారు.బుధవారం అల్లవరం గోడి గురుకుల పాఠశాలలో ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ గంజాయి,డ్రగ్స్,వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని,విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలైతే మీ బంగారు భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకుని కలలు కంటున్న మీ తల్లితండ్రుల కలలు కలలుగానే మిగిలి పోతాయని,అంతే కాకుండా మీ భవిషత్తు పాడు అవుతుందని విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,సైబర్ క్రైమ్ పై సి ఐ ప్రశాంత్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఎస్సై సంపత్ కుమార్ మాట్లాడుతూ మీ స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ప్రిన్సిపాల్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నక్కా శ్రీనివాస్,ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# కూటమి పాలనలో రహదారుల అభివృద్ధి వేగవంతం



రహదారి నిర్మాణాన్ని పరిశీలించిన నాయకులు.

**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 17:**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషితో ఆలమూరు మండలంలో రహదారుల అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని ఆలమూరు మండల తెలుగుదేశం అధ్యక్షులు ఈదల సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావు, వైట్ల శేషుబాబు, రాంబాబు తదితరులు పేర్కొన్నారు. బుధవారం వారు కొత్తూరు సెంటర్లో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఇక్కట్లు పడ్డ నర్సిపూడి, పెనికేరు,కలవచర్ల, కొత్తూరు సెంటర్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా రహదారి నిర్మాణం జరిగిందని వారు తెలియజేశారు. కొత్తూరు సెంటర్ నుంచి చింతలూరు సెంటర్ వరకు రహదారి మరమ్మత్తు జరుగుతుందన్నారు. చింతలూరు సెంటర్ నుంచి వెదురుమూడి వరకు రహదారి నిర్మాణానికి త్వరలో ప్రణాళికలు పూర్తవుతాయన్నారు.

పినపళ్ళ నుంచి వరాల కాలువ రహదారి వరకు రూ. 1.21 కోట్లతో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. గత వైసిపి పాలనలో ఒక్క రహదారిని నిర్మించడం కానీ కనీసం రోడ్లపై గుంతలు పూడ్చడం కానీ జరగలేదన్నారు. దానితో ప్రధాన రహదారులతో పాటు గ్రామాల్లోని రహదారులు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటన్నిటిని నిర్మించాల్సిన, మరమ్మత్తు చేయాల్సిన పూర్తి భారం అంతా కూటమి ప్రభుత్వం పైనే పడిందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి రహదారిని అభివృద్ధి చేసే బాధ్యత కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తీసుకున్నారని, నిధుల మంజూరుకు కృషి చేస్తున్నారని వారు తెలియజేశారు. రహదారుల నిర్మాణంతో ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై ఆదరాభిమానాలు మరింత పెరిగాయని వారు వ్యాఖ్యానించారు. బండారు అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటే బండారు అని, కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా జరుగుతున్నాయని వారు తెలియజేశారు.

## అడ్డతీగల లో ఘనంగా విశ్రాంతి ఉద్యోగుల దినోత్సవం...

**అడ్డతీగల, పెన్ పవర్, డిసెంబర్ 17:** మండల కేంద్రమైనఅడ్డతీగల లో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ను ఆనుకుని ఉన్న విశ్రాంతి ఉద్యోగుల భవనము లో విశ్రాంతి ఉద్యోగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యక్షులు ఏ. సూర్యకాంతం, ఆకిరి.రామారావు అధ్యక్షతన విశ్రాంతి ఉద్యోగుల దినోత్సవం నీ ఘనంగా నిర్వహించారు.



విశ్రాంతి ఉద్యోగుల అధ్యక్షరాలు ఏ. సూర్యకాంతం మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా విశ్రాంతి ఉద్యోగులకు పెన్షన్ రావడానికి ముఖ్య వ్యక్తి డీ.ఎస్ నకారా అని ఆయన పెన్షనర్స్ చేసిన సేవలను కొనియాడారు. ఎంతో వ్యయ ప్రయాసలతో సుప్రీంకోర్టులో కేసు వేసి వాదించి నాటి చీఫ్ జస్టిస్ వై.వి చంద్రచూడు పెన్షన్ బిక్ష కాదు హక్కు అని చారిత్రక మైన తీర్పు ఇచ్చారని, ఆనాటి నుండి నేటి వరకు పెన్షనర్ల జీవితాలలో వెలుగు నింపిన మహానుభావులను స్మరించుకోవడం సాంప్రదాయక వస్తుందని ఆమె అన్నారు. అధ్యక్షులు ఆకిరి. రామారావు మాట్లాడుతూ పెన్షనర్ల కు ఎప్పుడు ఏ విధమైన సహాయ సహకారాల ను కోరిన అందిస్తామని, మా వద్దకు నేరుగా వచ్చి కలవాలని తప్పనిసరిగా సహాయ సహకారాలు అందిస్తామని అధ్యక్షులు రామారావు తెలిపారు.

ఈ సమావేశంలో 70 సంవత్సరాలు పైబడిన సీనియర్ పెన్షనర్స్ ఘనంగా సన్మానించినారు. ట్రెజరర్ బాలయోగి మాట్లాడుతూ పెన్షనర్ ఈరోజున పండగ జరుపుకుంటు న్నామంటే నకారా వై.వి చంద్ర శూడ్ విశేషమైన కృషి చేశారని బాలయోగి అన్నారు . ఈ కార్యక్రమంలో ఏ. సూర్యకాంతం,ఆకిరి. రామారావు, బాలయోగి,పెన్షనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు నియోజకవర్గానికి బొడ్డు రాక..

నాయకులు కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ ఏర్పాట్లు..



**కోరుకొండ, పెన్ పవర్, డిసెంబర్ 17:.** రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, రుడా చైర్మన్, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు మధురపూడి ఎయిర్పోర్ట్ కు చేరుకుంటారు. తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పదవి వచ్చిన సందరరేగా ఆయన ఏర్పోర్ట్ నుండి బూరుగుపూడి పార్టీ కార్యాలయనికి నాయకులు కార్యకర్తలు అభిమానులు మధ్య ఆయన చేరుకుంటారు. ఈ సందరరేగా నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేపట్టారు.

## విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్విని చేసుకోవాలి.

ఎంపీపీ సత్యనారాయణ



**గోపాలపురం, పెన్ పవర్, డిసెంబర్ 17.** విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలని గోపాలపురం ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ను ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీవో జిల్లా రాజ్ మనోహర్ లు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు జి శ్రీనివాసరావు, ఈ ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జన్మ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులకు సాంకేతిక విద్య ఎంతో అవసరం అన్నారు. బాలి నుండి అందుకు అనుగుణంగా విద్యార్థులు విద్యను అభ్యసించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఎంపీడీవో రాజ్ మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో రాణించాలన్నారు. విద్యలో నూతన వరవడిలను సృష్టించాలన్నారు. సాంకేతిక విద్యపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల ప్రాజెక్టులు చూపరు లను విశేషంగా ఆకట్టుకున్నాయి. మండల స్థాయిలో విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు పి వెంకట కనక పద్మ, దాతలు ఈలి శరత్ బాబు, కూసం రామ్మోహన్ రెడ్డి, వెలగ శ్రీరామమూర్తి, మద్దిపాటి రమేష్, భూ రెడ్డి శ్రీనివాస్, సిఆర్పిలు కొయ్య నాగరాజు, వై సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1.56 కోట్లు



**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 17:** వాడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 1,56,31,085 రూ, ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన ఆలయం, శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీల ద్వారా 1,28,07,874 రూ,లభించగా, అన్నప్రసాదం హుండీల ద్వారా 28,23,211 రూ,ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు.

అలాగే భక్తులు సమర్పించిన 27 గ్రాముల బంగారం, 1 కిలో 150 గ్రాముల వెండి స్వీకరించారు. ఇంకా అమెరికా, ఒమాన్, కువైట్, సౌదీ అరేబియా, ఖతర్, దుబాయ్, సింగపూర్, బహ్రెయిన్, కెనడా, ఇండోనేషియా తదితర 10 దేశాలకు చెందిన 43 విదేశీ కరెన్సీ నోట్లు కూడా లభించాయి.ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, అర్చకస్వాములు, వేద పండితులు, బ్యాంకు ప్రతినిధులు, పోలీసులు, శ్రీవారి సేవకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. భక్తుల విరాళాలతో దేవస్థాన అభివృద్ధి కార్యక్రమాలు మరింతగా కొనసాగనున్నాయని అధికారులు తెలిపారు.

## ఆత్రేయపురం పోలీస్ స్టేషన్‌కు డీఎస్పీ వార్షిక తనిఖీ



**ఆత్రేయపురం,పెన్ పవర్ డిసెంబరు 17:**పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీల్లో భాగంగా కొత్తపేట సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి (డీఎస్పీ) సుంకర మురళీమోహన్ బుధవారం ఆత్రేయపురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు సంబంధించిన కేసు డైరీలు, రిజిస్టర్లు, రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు.

చట్టసంబంధిత వ్యవహారాల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ప్రజలకు సత్వర న్యాయం అందేలా పోలీసులు పనిచేయాలని డీఎస్పీ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు అనుకూలంగా వ్యవహరించాలని సూచనలు చేశారు.

ఈ తనిఖీలో రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్ఐ ఎస్. రాము పాల్గొని స్టేషన్‌లో అమలవుతున్న విధానాలు, నమోదైన కేసుల వివరాలను డీఎస్పీకి వివరించారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.



**కిర్లంపూడి, పెన్ పవర్, డిసెంబర్, 17:** పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని నాగం సుధామాధురి పిలుపునిచ్చారు. బుధవారం కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగం సుధామాధురి మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా గ్రామంలో అపరాల ప్రదర్శనా క్షేత్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని రైతులకు సూచించడం జరిగిందన్నారు.అదే విధంగా ట్రైకో డెర్మా విరిడితో అపరాల విత్తనశుద్ధి చేయడం గురించి వివరించారు.అదేవిధంగా ఇక మీదట యూరియా కార్డు ద్వారానే రైతులకు దఫ దాఫాలుగా యూరియా అందించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు నంది బాలకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు సునీత, పలువురు రైతులు పాల్గొన్నారు.

## సబ్ జైలును సందర్శించిన డిఎల్ఎస్ఏ కార్యదర్శి



**పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 17 :** పెద్దాపురం పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ( రాజమహేంద్రవరం) కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీల యోగక్షేమాలు అడిగి తెలుసుకుని వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీరు, జైలు పరిసరాలను నిశితంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రమణబాబు, అడ్వకేట్ అత్తిలి ప్రభుజీ, పారా లీగల్ వాలంటీర్లు నూతలపాటి అప్పలకొండ, కె. జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి మెదడులు - భవిష్యత్ ఆవిష్కరణలకు నెలవులు



**కాజులూరు, పెన్ పవర్ డిసెంబర్ 17:**కాజులూరు మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖా ధికారులు డేవిడ్,జాన్‌ల అధ్యక్షతన మండలంలోని ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల విద్యార్థులతో స్థానిక కాజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా - వైజ్ఞానిక ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి పర్యవేక్షించారు.ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా మండల పరిషత్ అధ్యక్షులు భారతీ మురళీకృష్ణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె. రాంబాబు హాజరై విద్యార్థుల ప్రదర్శనలను ఆసక్తిగా పరిశీలించి అభినందించారు.అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడు తూ,ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించి,సృజనాత్మక ఆలోచనలకు దోహద పడతాయన్నారు. మండల విద్యాశాఖాధికారి డేవిడ్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి విద్యార్థులు చిన్న వయస్సు నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.జడ్జిమెంట్ నిర్వహించిన స్థానిక కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, భౌతిక శాస్త్ర అధ్యాపకులు రామ్ కుమార్,జీవశాస్త్ర అధ్యాపకులు సత్యనారాయణ మూర్తి,రసాయన శాస్త్ర అధ్యాపకులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులందరూ విజేతలేనని, ప్రతి విభాగం నుంచి కొద్దిమందినే ఎంపిక చేయాల్సి రావడంతో నిర్ణయం తీసుకున్నామన్నారు.పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు చింతా నారాయణ మూర్తి మాట్లాడుతూ తరగతిలో చురుకుగా ఉండే విద్యార్థులు కూడా సైన్స్ ఎగ్జిబిట్ల ద్వారా ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు.ఈ ప్రదర్శనలో విజేతలుగా నిలిచిన కాజులూరు హైస్కూల్‌కు చెందిన లలితాదిత్య, నిత్య ప్రియ వర్షిత, కుసుమ దుర్గ, వట్టూరి చిన్నారి,శ్రీ కోటి స్కూల్‌కు చెందిన దివ్య,పల్లిపాలెం హైస్కూల్‌కు చెందిన విజయ్ కుమార్, జగన్నాథ గిరి హైస్కూల్‌కు చెందిన శశి సత్య సుధజిల్లా స్థాయిలో కాకినాడలో నిర్వహించనున్న సైన్స్ ఫెయిర్‌లో పాల్గొననున్నారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మలత, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు,కాజులూరు పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేతో బహుళ ప్రయోజనాలు

పెద్దాపురం ఎంపీడీవో సూర్యనారాయణ



**పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 17 :** సంక్షేమ పథకాలు అర్హులకు చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఇంటింటి సర్వే ప్రారంభించినట్లు పెద్దాపురం ఎంపీడీవో కె.వి.సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా విలేఖరులతో ఆయన మాట్లాడారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే - 2025 (యూఎఫ్ఎస్) పేరుతో నిర్వహించే సర్వే వచ్చే ఏడాది జనవరి 12 వరకు కొనసాగనుంది. పెద్దాపురం మండల పరిధిలోని గ్రామాల్లోని సచివాలయ ఉద్యోగులు హౌసింగ్ మ్యాపింగ్ చేస్తూ కుటుంబ సర్వే చేస్తారు. కుటుంబాల సమగ్ర అధ్యయనాల సమాచారం మేరకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు బహుళ ప్రయోజనం చేకూరుతుంది. ఈ సర్వేలో సేకరించాల్సిన సమాచారానికి సంబంధించిన ప్రశ్నల జాబితాలను సచివాలయాల ఉద్యోగులకు అందజేస్తారు. ఈ జాబితాల ప్రకారం సచివాలయ సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి కుటుంబ సమాచారం ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సేకరించి ఆన్ లైన్ లో నమోదు చేస్తారు. సర్వే ద్వారా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సరికొత్తగా నమోదు చేస్తూ ఆ కుటుంబాల్లో చనిపోయిన, శాశ్వత మైగ్రేషన్ వ్యక్తులు పేర్లు తొలగిస్తారు. ఇది ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఆటో డ్రైవర్ సేవలో, తదితర పథకాలు వర్తింపునకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రత్యేక యాప్ ద్వారా మొబైల్ లో ఈకేవైసీ ఆధారంగా వ్యక్తిగత, కుటుంబ సమాచారం సేకరిస్తారు. ఆధార్, మొబైల్ నెంబర్, విద్య, ఉపాధి, ఆదాయం, ఆస్తులు, గృహ వివరాలు, సామాజిక తదితర కుటుంబ సభ్యులు వివరాలు తీసుకుంటారు. అనంతరం ప్రభుత్వం కుటుంబ ప్రయోజన పత్రాలు అందజేస్తుంది. భవిష్యత్తు సంక్షేమ సేవలు కార్డుల ఆధారంగా అమలు చేస్తారు.

## ఘనంగా తిరుపతి సీజీఎం వార్షికోత్సవం



**పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 17 :** మండల పరిధిలోని తిరుపతిలోని క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ ఫౌండర్ ట్రస్టీ నంగిన శామ్యూల్ సుదీప్ ఆధ్వర్యంలో స్థానిక చర్చి సమీపంలోని మైదాన ప్రాంగణంలో తిరుపతి గ్రామ పరిసర, ఏజెన్సీ ప్రాంతాల విశ్వాసులతో క్రిస్మస్ ఆరాధనను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన క్రిస్మస్ ఆరాధన సభలో పాలచర్ల గాడ్స్ గ్రేస్ గాస్పల్ మినిస్ట్రీస్ అధినేత బ్రదర్ గ్రేస్ విక్టర్ మాట్లాడుతూ సర్వమానవాళికి మార్గదర్శి ఏసు ప్రభువేనన్నారు. క్రీస్తు జననం పాపంలేనిదని, పాపక్షమాపణకై దేవుడు ఈ లోకానికి కన్య మరియ గర్భాన జన్మించి అందరికి ఆదర్శప్రాయుడుగా నిలిచారన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం దైవజనులు, సిజిఎం గౌరవాధ్యక్షులు నంగిన సత్యానందం, శాంతకుమారి దంపతులు, ప్రముఖ అంతర్జాతీయ గాయకులు సునీలు, సుజాత, నజరేష్, పాస్టర్స్ వంకా జాన్, కాసా అభిషేక్, జయకుమార్, ఎలీషా, పాస్టరమ్మలు నంగిన శాంతకుమారి, నంగిన ప్రేమలత, విశాల. సుజాత, రూత్ ప్రశాంతి, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ల 5వ కాన్ఫరెన్స్ వీసీకి హాజరైన డీఆర్ఓ,జిల్లా అధికారులు

**కాకినాడ, పెన్ పవర్, డిసెంబర్ 17:**రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అమరావతి రాష్ట్ర సచివాలయంలో ప్రారంభించిన రెండు రోజుల అన్ని జిల్లాల కలెక్టర్ల 5వ సమావేశాన్ని కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో సీపీవో పీ.త్రినాథ్,జిల్లా పంచాయ తీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఏవీఎస్ శ్రీనివాసు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సునీల్, జిల్లా పరిషత్ ఏవో ఎం.బుజ్జిబాబు, వైద్య - ఆరోగ్యం,కమర్షియల్ టాక్స్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం లో ఎంఎస్సి కోర్స్ కి 81 విద్యార్థులకు అడ్మిషన్లు.

- ఎంఎస్సీ హార్టికల్చర్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్స్ ప్రవేశానికి కౌన్సిలింగ్ 110 సీట్లు కు 81 మంది అడ్మిషన్లు.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 17.**డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం లో పరిధిలోని వెంకటరామన్న గూడెం ఉద్యాన కళాశాల మరియు అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో ఎంఎస్సీ హార్టికల్చర్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్స్ ప్రవేశానికి కౌన్సిలింగ్ వెంకటరమణ గూడెం ఉద్యాన కళాశాలలో జరిగింది. ఐ సి ఏ ఆర్ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుకూలంగా ఈ కౌన్సిలింగ్ జరిగింది. ఈరోజు మొత్తం 110 సీట్లు కౌన్సిలింగ్ జరగగా 81 మంది అడ్మిషన్లు అయ్యారు. మిగిలిన 29 సీట్లకు తదుపరి కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ కౌన్సిలింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కే ధనుంజయరావు విచ్చేసి విద్యార్థులు ఉద్దేశించి అనేక సూచన చేశారు. రైతుల అవసరాలు సరిపడే టెక్నాలజీ కోసం పరిశోధన చేయాలని విశ్వసంబంధమైన జ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి అవగాహన సంపాదించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఆంధ్ర రాష్ట్రం హార్టికల్చర్ల హబ్ గా మారాలని మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ అందుకు మన విశ్వవిద్యాలయం సన్నద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరీక్షలు నియంత్రణ అధికారి డాక్టర్ బి ప్రసన్నకుమార్ డిన్నర్ హార్టికల్చర్ డాక్టర్ ఎం మాధవి, ఎస్సీ ఎస్టీ సెల్ ఆఫీసు ఇంచార్జ్ డాక్టర్ వెంకట సోమయ్య వెంకటరామన్న గూడెం ఉద్యాన కళాశాల డీన్ అశోక్ రెడ్డి విశ్వవిద్యాలయం డాక్టర్ శివప్రసాద్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ పాతోల్,సుపర్డిడెంట్స్ సుజాత, సుబ్బారావు పాల్గొన్నారు.

## పిహెచ్సీ ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ.



**ఏలేశ్వరం, పెన్ పవర్, డిసెంబర్ 17:** నగర పంచాయతీ ఏలేశ్వరంలో పల్స్ పోలియో కార్యక్రమం పై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఓ పీ మాణిక్య కుమారి,వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ లో సిహెచ్ఓ మాట్లాడుతూ డిసెంబర్ 21వ తేదీన జరుగునున్న పల్స్ పోలియోపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి అన్నారు.పోలియో రహిత సమాజాన్ని నిర్మిందామని, నిండు జీవితానికి రెండు చుక్కలు అవసరమనే నినాదాలతో స్థానిక బాలాజీ చౌక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. తొలిత ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలకు పల్స్ పోలియోపై అవగాహన సదస్సును హెల్త్ సూపర్వైజర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ కె. దైవ కృప, హెల్త్ అసిస్టెంట్ లు ఇ. జగదీష్, పి. నానిబాబు, ఎన్ ఆర్ ప్రసాద్, డి రాజు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 108 లో ప్రసవం తల్లి బిడ్డ క్షేమం...




**అడ్డతీగల, పెన్ పవర్,డిసెంబర్ 17:** ఏలేశ్వరం మండలం పరిమితడక గ్రామానికి చెందిన సందక. కొండాజి అనే మహిళకు పురిటి నొప్పులు ఎక్కువగా రావడం తో 108 సమాచారం రాగానే 108 సిబ్బందితోపాటు, కోఆర్డినేటర్ శామ్యూల్ 108 సిబ్బందితో హుటా హుటీన్ చేరుకున్నారు. పురిటినొప్పులు ఎక్కువ కావడంతో అడ్డతీగల మండలం తిమ్మాపురం లో 108 వాహనం ఆపి పొగ మంచులో 108 సిబ్బంది ప్రసవం చేయడం జరిగింది. ఆ తల్లి పండంటి ఆడబిడ్డ కు జన్మనిచ్చింది, ప్రసవానంతరం అడ్డతీగల ఆసుపత్రికి తల్లి బిడ్డను 108 సిబ్బంది క్షేమంగా చేర్చారు, మహిళ ప్రసవ సమయంలో సిబ్బంది, ఈ.ఎం.టి అశోక్ పైలట్, ఎస్.కె.బి నవాజ్, ఆశ వర్కర్ లక్ష్మమ్మ ను సకాలంలో స్పందించినందుకు 108 కోఆర్డినేటర్ సామ్యూల్ ను గ్రామస్థులు అభినందించారు. ఆపద కాలంలో ఆదుకునే 108 మాకు అండగా ఉంటుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఈ నెల 19న ఉద్యోగుల పీజీఆర్ఎస్ కార్యక్రమం

జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ, పెన్ పవర్, డిసెంబర్ 17:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచనల మేరకు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం (పీజీఆర్ఎస్)ను ఈ నెల 19వ తేదీ మూడవ శుక్రవారం నిర్వహించనున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో సాయంత్రం 4.00 గంటల నుంచి 5.00 గంటల వరకు నిర్వహించబడుతుందని, ఈ సమయంలో ప్రభుత్వ ఉద్యోగుల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.అధికారులందరూ ఈ నెల 19వ తేదీ సాయంత్రం 3.45 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన సూచించారు.ఈ అవకాశాన్ని ప్రభుత్వ ఉద్యోగులు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com